

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV
STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 260 | ఎడిటర్ : బరిగెల శివ | శుక్రవారం, 21, ఆగస్టు 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్


# అప్పుల రాష్ట్రంలో అవినీతి కుప్పలు!






- జీతం తక్కువ దోపిడీ ఎక్కువ
- ఎంత దోచుకుంటే అంత హీరోలు
- అవినీతిపరులా మజాకా అవినీతి చేస్తూనే పదోన్నతులు పొందుతున్నారు
- హద్దులు దాటుతున్న అవినీతి
- సీఎం, బట్టి, పొంగులేటి, శాఖలో పెరిగిపోతున్న అవినీతి
- అవినీతిపరులకు ఆదిత్యమిస్తున్న అధికారులు
- రాజకీయం అధికార పలుకుబడి అవినీతి సామ్రాజ్యాలను స్థాపిస్తుంది
- ఎంత అవినీతికి పాల్పడితే అన్ని అధికార పదవులు లభిస్తున్నాయి
- తెలంగాణలో రికార్డు స్థాయిలో పెరుగుతున్న అవినీతి
- ఏసీబీ అధికారుల దాడులు మచ్చుకైనా పట్టించుకోని అవినీతిపరులు
- అవినీతిపరులు ఆగడాలకు జడుసుకుంటున్న ప్రభుత్వ కార్యాలయాలు
- నిజాయితీపరులను వెంటాడుతూ అవినీతి నిలువ దోపిడీకి పాల్పడుతున్నారు
- గల్లీ నుండి మొదలుకొని ఢిల్లీ వరకు అవినీతిపరుల పైరవీలే : డాక్టర్ బరిగెల శివ

హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

అవినీతిని నిర్మూలించకపోతే అప్పుల రాష్ట్రం తిప్పలపడక తప్పదని డాక్టర్ బరిగెల శివ వ్యాఖ్యానించారు. అసలే రాష్ట్రం అప్పుల్లో కూరుకు పోతుంటే అవినీతిపరులంతా అవినీతికి ఆద్యం పోస్తూ వ్యవస్థలను పాడు చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర అప్పులపై విశ్లేషిస్తున్న మేధావులంతా అవినీతిపరుల గురించి ప్రస్తావించకపోవడం రాష్ట్రంలో దౌర్భాగ్యపు వాతావరణం పెరిగిపోతుందన్నారు. అవినీతిపరులపై ఎప్పటికప్పుడు విశ్లేషణాత్మకమైన సంభాషణలు జరగాల్సి ఉండెనని పేర్కొన్నారు. గతంలో అవినీతి చేయాలంటే భయపడే వాళ్ళని కాలక్రమేనా అధికారం అంటేనే అవినీతి అనే స్థాయికి ప్రభుత్వ కార్యాలయాలు దిగజారిపోయాయని అధికారికంగా దోచుకోవడమే కాకుండా అనధికారకంగా దోచుకోవడం ప్రభుత్వ కార్యాలయాల వంతుగా అధికార వ్యవస్థ కొనసాగడం అధికారుల వ్యక్తిగత దిగజారుడుతనానికి నిదర్శనం అన్నారు. ఆయా ప్రభుత్వ శాఖలకు అధికారికంగా కేటాయించబడుతున్న ప్రభుత్వ సొమ్మును తప్పుడు బిల్స్ పెడుతూ ప్రభుత్వ సొమ్మునంత మాయం చేస్తున్నారని తీవ్రంగా హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్రంలో

- మిగతా 2లో..



డాక్టర్ బరిగెల శివ
జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్





## గుట్టు చప్పుడు కాకుండా రాసలీలలు..?

- పెళ్లి చేసుకుంటానని నమ్మించారని ఫిర్యాదు
- మూడు సార్లు అబార్షన్ చేయించుకున్నానని ఆరోపణ
- ఉన్నతాధికారులను ఆశ్రయించినా న్యాయం లేదని వాపు
- ఎస్పై త్వరలో వివాహం చేసుకోనున్నారనే ప్రచారం
- ఆరోపణలపై సమగ్ర విచారణకు డిమాండ్



2

## బడిలో భయం వద్దు.. అనురాగమే ముద్దు!

దండనా సంస్కృతికి చరమగీతం పాడాలి..
పసి మనసులకు ప్రేమతో కూడిన విద్యే అవసరం
డాక్టర్ బరిగెల శివ



2

## "నాకు నా రాజీవ్‌ను తిరిగి ఇవ్వండి"

ప్రేమ, విషాదం, త్యాగం...
సోనియా గాంధీ జీవితంలో
చెరగని గాయాలు



2

## రాజీవ్ గాంధీకి రేవంత్ నివాళి

- మాజీ ప్రధానమంత్రి జయంతి సందర్భంగా ఘన నివాళులర్పించిన సీఎం
- శాంతి, సౌభ్రాతృత్వం, మత సామరస్యానికి సద్భావనా దినోత్సవం స్ఫూర్తిదాయకమని వెల్లడి
- సమైక్యతే మన శక్తి.. సద్భావనే మన ప్రగతి అని సందేశం
- రాజీవ్ గాంధీ ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపు
- బలమైన భారతదేశ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విజ్ఞప్తి



3

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem

# అప్పుల రాష్ట్రంలో అవినీతి కుప్పలు

మొదటి పేజీ తరువాయి

ప్రధాన శాఖలన్నీ అవినీతి మయంలో కూరుకుపోతుండగా మేమేం తక్కువ కాదంటూ ప్రభుత్వ అధికారులు అవినీతి రొంపులో దూసుకుపోతున్నారని అన్నారు.ముఖ్యంగా మంత్రిత్వ శాఖలన్నీ పూర్తి అవినీతిమయానికి దగ్గరయిపోయాయని వాపోయారు.అభివృద్ధికి, అప్పులకు తెలంగాణ రాష్ట్రంలో చాలా వ్యత్యాసం కనిపిస్తుందని అవినీతి అనేది ఉన్న పాటుగా పతాక స్థాయికి చేరిపోతుండగా అభివృద్ధి కుంటుపడుతుందన్నారు.అదే సందర్భంలో అప్పులు విపరీతంగా పెరిగిపోతున్నాయని దాన్ని బట్టి చూస్తే అవినీతి ఒకవైపు అప్పులు ఒకవైపు, మందకోడి అభివృద్ధి మరోవైపు తెలంగాణ రాష్ట్రాన్ని ఊపిరాడకుండా చేస్తున్నాయన్నారు.కాంగ్రెస్ హయాంలో తారాసాయికి చేరిన అవినీతిని చూసి ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారన్నారు.2025 సంవత్సరపు రికార్డులను 26 సంవత్సరం ఆరు నెలల్లోనే అవినీతి రికార్డులను దాటవేసిందని దానికి నిదర్శనంగా ఆరు నెలల పాటు రాష్ట్రంలో జరిగిన ఏసీబీ కేసుల దాడులే ప్రధాన కారణంగా చూడవచ్చునన్నారు.తలసరి ఆదాయంలో ఒకప్పుడు ధాన్యం ఉత్పత్తుల్లో ఎంతో మెరుగైన లాభాలను పొందుకున్నామని,గ్రామీణ అభివృద్ధి క్రమక్రమంగా పెరిగేదని మెడికల్ కాలేజీల్లో రికార్డులు సృష్టించిన అభివృద్ధిని జ్ఞాపకం చేస్తూ,తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక నేరాల్లో మద్యం అమ్మకాల్లో అవినీతిలో టాప్ ర్యాంక్ సాధిస్తూ తలవంతులు చేస్తుందని బాధ వ్యక్తం చేశారు.అన్నిటికన్నా ముఖ్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగా ప్రధానమంత్రిత్వ శాఖల స్థాయిలో విచ్చలవిడిగా అవినీతి పెరిగిపోతుండడంతో దానిని అదునుగా చేసుకొని పై స్థాయి ఉన్నతాధికారులు మొదలుకొని చిరు ఉద్యోగుల వరకు అవినీతిలో చెలరేగిపోతున్నారని పేర్కొన్నారు.2025 ఏడాది మొత్తంలో నమోదైన ఎసిబి కేసుల సంఖ్యను 2026 లో ఆరు నెలల్లోనే దాటేయడం చూస్తే కాంగ్రెస్ పాలనలో అవినీతి ఎంత దారుణంగా పెరిగిపోతుందో అర్థమవుతుందన్నారు.అవినీతి నిరోధక శాఖ అధికారులు అవినీతిపరుల భరతం పట్టడం జోరు పెరుగుతున్నప్పటికీ అవినీతి అధికారులకు ఏమాత్రం చలనం రావడం లేదని ఎంతటి అవినీతికి పాల్పడిన ఉద్యోగం పోదనే ధీమా ఉండడంతో అధికారుల అవినీతికి హద్దు పద్దు లేకుండా పోతుందన్నారు.వాటితోపాటు సీఎం చేతిలో ఉన్న పోలీస్ శాఖ మున్సిపల్ శాఖ పొంగులేటి చేతిలో ఉన్న రెవెన్యూ శాఖ బట్టి చేతిలో ఉన్న ఫైనాన్స్ రెవెన్యూ శాఖలు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అవినీతిలో టాప్ స్థాయిలో ఉన్నాయని దీన్నిబట్టి పైనున్న మంత్రుల పరిస్థితి ఏమిటో ప్రజలు సునాయాసంగా తెలుసుకుంటున్నారన్నారు.

### అవినీతి అధికారులపై కొత్త చట్టం రావాలి..

అవినీతిపరులకు ఉద్యోగ బహిష్కరణ ఒక్కటే మార్గం అంటూ స్పష్టంగా గుర్తుచేశారు.2014 జూన్ 2 నుండి నేటి వరకు అవినీతిపరులుగా వెలుగొంది అవినీతి కేసుల్లో ఇరుక్కుంటూ జైలు జీవితాలను అనుభవించిన ఉద్యోగులను అధికారులను క్రింది స్థాయి ఉద్యోగులు ఏ ఒక్కరిని క్షమించకుండా, పేక్షించకుండా ఉద్యోగ బహిష్కరణ చేస్తే తప్ప అవినీతి అనేది అంతరించబడేలా లేదని హెచ్చరించారు.ప్రభుత్వాలు అవినీతి అధికారులపై ఎంతటి కఠినమైన చర్యలు చేపట్టిన అధికారులలో మార్పు రాకపోవడానికి ప్రధాన కారణం అవినీతిపరులే రాజకీయ పరుపతి కలిగిన నాయకులకు సన్నిహితులుగా వెలుగొందుతున్నారని హెచ్చరించారు.ఏసీబీ అధికారుల దాడులు పెరుగుతున్న కొద్దీ అవినీతి కూడా పెరిగిపోతుందని ఏసీబీ అధికారుల కేసులను అవినీతిపరులు ఏమాత్రం పరిగణలోకి తీసుకోవడం లేదంటూ ఏ ప్రభుత్వ కార్యాలయంలో నైతే అవినీతి నిరోధక శాఖ అధికారులు అవినీతిపరులను అడ్డుకుంటున్నారో అదే శాఖలలో అవినీతి విచ్చలవిడిగా పెరిగిపోతుందని దుయ్యపడ్డారు.విద్యాశాఖలో రెవెన్యూ శాఖలో పోలీస్ శాఖలో మున్సిపల్ శాఖలో అవినీతి కుంభకోణాలు ఊహించలేనివని వాటిని పెంచి పోషించడానికి ప్రత్యక్ష మార్గాలు జరుగుతుండగా ప్రతి ఉన్నతాధికారి ముందు అవినీతి సామ్రాజ్యాన్ని పెంచి పోషించడం కోసం కాస్తైనా సాంకేతిక పరిజ్ఞానం కలిగిన అధికారులు సహాయకులుగా ఉపయోగపడుతూ అవినీతి కుంభకోణాలను అభివృద్ధి చేయడంలో కీలకపాత్రను పోషిస్తున్నారని అన్నారు.రాజకీయ నాయకుల అండదండలతో పదవులు తెచ్చుకోవడం తెచ్చుకున్న పదవులలో మొదటి నుండి అవినీతికి పాల్పడడం ఆనవాయిదిగా పెట్టుకుంటున్నారని తీవ్రంగా విమర్శించారు.ఆంధ్రప్రదేశ్లో అయితే అవినీతి అనేది చెప్పడానికే వీరు లేకుండా పోతుందని ప్రతి ప్రభుత్వ స్కీములో స్కాముల గోల పెరిగిపోతుందన్నారు.ప్రతి విషయంలో అవినీతిని చేయకపోతే ప్రభుత్వాలు నడవలేవనే విధమైన సాకేతాలను ప్రజలకు చేరవేస్తూ అవినీతి సామ్రాజ్యాన్ని పెంచి పోషిస్తున్నారని మండిపడ్డారు.కాస్తయినా నిజాయితీని కనపరుస్తూ అవినీతిని నిర్మూలించబడే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ముమ్మర ప్రయత్నాలు చేస్తే అవినీతిపరుల బహిరంగ అవినీతి రూపాలను నిర్మూలించగలమని లేని పక్షాన ఇచ్చలవిడిగా పెరిగిపోతున్న అవినీతిని ఎవరు అడ్డుకట్ట వేయలేరని స్పష్టం చేశారు.ఆస్తుల సంపాదనకు మరుగుతున్న ప్రతి ఒక్కరు అవినీతి సామ్రాజ్యాలను పెంచి పోషించడానికి ఉద్యోగ ధర్మాన్ని అధికార పదవులను వాడుకుంటున్నారని ప్రభుత్వ వ్యవస్థలను కాపాడడం కోసమైతే ఏమాత్రం కాదన్నారు.స్వయంగా ప్రధానమంత్రిత్వ శాఖలు అవినీతికి దగ్గరగా దారులు వేసుకుంటూ పోతుంటే సామాన్య ప్రభుత్వ కార్యాలయాలు వాటి పరిస్థితి ఏమిటంటే సూటిగా నిలదీశారు.రాష్ట్రం అభివృద్ధి జరగాలంటే అప్పులు తెచ్చుకోవాలని తెచ్చుకున్న అప్పులను అభివృద్ధి కోసం వాడకుండా అవినీతిని పెంచి పోషించడం కోసం వాడబడుతున్నట్లుగా రాష్ట్ర ప్రజలు ఆందోళనను వ్యక్తపరుస్తున్నారన్నారు. ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్న ప్రతి ఒక్కరు ప్రభుత్వం నుండి కావాల్సినంత జీతాలు తీసుకుంటూ అధికారంలో కొనసాగుతూ ఉండడమే కాకుండా ప్రత్యక్షంగాను రాష్ట్రం అప్పుల పాలు కావడానికి ప్రతి ప్రభుత్వ కార్యాలయంలోని ప్రజాధనాన్ని ప్రభుత్వ ధనాన్ని అవినీతి రూపంలో దండుకుంటూ వాటన్నిటికీ తప్పుడు బిల్లులను తప్పుడు ఆడిట్ విధానాలను రూపొందిస్తూ వ్యవస్థలను నిర్వీర్యం చేసే క్రమంలో ప్రభుత్వాన్ని రాష్ట్రాన్ని అప్పులపాలు చేస్తున్నారని అలాంటి అధికార వ్యవస్థలపై క్షేత్రస్థాయి సమగ్ర విచారణ జరగాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలియజేస్తూనే రాష్ట్రంలో అవినీతికి పాల్పడిన ప్రతి ఉద్యోగిని ప్రతి అధికారిని ప్రతి సామాన్య ఉద్యోగిని ఉద్యోగం నుండి శాశ్వతంగా బహిష్కరించే చట్టం తీసుకొస్తే తప్ప ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారుల అవినీతి ఉద్యోగుల అవినీతి సాధారణ ఉద్యోగుల అవినీతి ఏమాత్రం తగ్గదనేది స్పష్టమవుతుందన్నారు.అధికారులే ఇలా ఉంటే రాజకీయ నాయకులు ఇంకెలా ఉంటారో రాష్ట్ర ప్రజలు ఎప్పుడో అంచనాలు వేసుకోగలిగారని తెలిపారు.అవినీతి చేస్తూ కమిటీలు వేయబడిన ప్రతి అధికారి పట్ల ప్రభుత్వంతోపాటు ఆయా ప్రభుత్వ కార్యాలయాల్లోని పరిపాలన అధికారులు అప్రమత్తంగా ఉంటూనే అలాంటి అవినీతిపరులకు ఎలాంటి పదవులు కేటాయించకుండా వాళ్ళ కదలికలపై నిఘాలు వేస్తూ ఎప్పటికప్పుడు వాళ్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి వెనుకాడ కూడదన్నారు.ఏ ప్రభుత్వ శాఖలో చూసిన నిజాయితీగా పని చేసే ప్రభుత్వ అధికారులు నిందలపాలవుతూ అవినీతిని చివరి అంచుల వరకు ఆస్వాదించి ఎవరికీ అందనంత అవినీతి సొమ్మును సంపాదించుకొని అక్రమార్కులుగా వెలుగొందుతున్న ప్రతి ఒక్కరు నిజాయితీపరులుగా చలామని అవ్వడం కోసం అన్ని రకాల శక్తి యుక్తుల్ని సంపాదించుకుంటున్నారని విమర్శించారు.ప్రభుత్వ అవినీతి మంత్రుల అవినీతి ప్రభుత్వ కార్యాలయాల అవినీతి సాధారణ ప్రజల సొమ్మును దోచుకుంటున్నట్లుగా స్పష్టమైపోతుంది అన్నారు.

# "నాకు నా రాజీవ్‌ను తిరిగి ఇవ్వండి"

**ప్రేమ, విషాదం, త్యాగం...**

**సోనియా గాంధీ జీవితంలో చెరగని గాయాలు**



**న్యూఢిల్లీ(జై భీమ్ న్యూస్)**

"నాకు నా రాజీవ్‌ను తిరిగి ఇవ్వండి.. నేను తిరిగి వెళ్లిపోతాను. అలా తిరిగి ఇవ్వకపోతే, నన్ను కూడా తాను కలిసిన ఈ మట్టిలోనే కలిసి ఇక్కడే చనిపోనివ్వండి" – ఈ మాటలు రాజీవ్ గాంధీని కోల్పోయిన తర్వాత సోనియా గాంధీ అనుభవించిన తీవ్ర విషాదాన్ని ప్రతిబింబించేలా ఉన్నాయి. రాజీవ్ గాంధీతో తన తొలి పరిచయం నుంచి వివాహం, కుటుంబ జీవితం, రాజకీయాల్లోకి రాజీవ్ ప్రవేశం, ఇందిరాగాంధీ హత్య, ఆ తర్వాత రాజీవ్ గాంధీ హత్య వరకు ఎదుర్కొన్న సంఘటనలను గుర్తు చేసుకుంటూ సోనియా గాంధీ చెప్పినట్లు ప్రచారంలో ఉన్న ఈ సారాంశం భావోద్వేగానికి గురిచేస్తోంది. విదేశీ నేలపై రాజీవ్‌ను తొలిసారి చూసిన సందర్భం నుంచి ఇద్దరి మధ్య ఏర్పడిన అనుబంధం వరకు సాగిన ప్రేమకథ, అనంతరం భారతదేశంలో కొత్త జీవితానికి శ్రీకారం చుట్టిన సందర్భాలు ఇందులో ప్రస్తావించబడ్డాయి. రాజీవ్ రాజకీయాల్లోకి రావడం మొదట తనకు ఇష్టం లేకపోయినా, దేశం కోసం ఆయన చేస్తున్న కృషిని అర్థం చేసుకుని కుటుంబ బాధ్యతలను స్వీకరించినట్లు ఈ కథనం చెబుతోంది. అయితే 1984లో ఇందిరాగాంధీ హత్య కుటుంబాన్ని తీవ్ర విషాదంలోకి నెట్టింది. ఇందిరాగాంధీని కోల్పోయిన బాధ నుంచి కుటుంబం కోలుకోకముందే, 1991లో రాజీవ్ గాంధీ హత్య మరో విషాదాన్ని మిగిల్చింది. తన జీవిత భాగస్వామిని కోల్పోయిన ఆ క్షణం సోనియా గాంధీ జీవితంలో చెరగని గాయంగా మిగిలిపోయిందనే భావన ఈ సారాంశంలో కనిపిస్తుంది. "ప్రభుత్వాలు వస్తాయి.. పోతాయి. విమర్శలు, అవమానాలు నన్ను బాధపెడుతున్నాయా? కాదు. ప్రేమించిన వ్యక్తి మృతదేహాన్ని చూడటం ఎంతటి బాధో నాకు తెలుసు" అనే భావోద్వేగ సందేశం ఇందులో ప్రధానంగా నిలుస్తోంది. రాజీవ్ గాంధీతో గడిపిన మధుర జ్ఞాపకాలను మాత్రమే గుర్తుంచుకోవాలని, తన జీవితంలో ఎదురైన వ్యక్తిగత విషాదాన్ని రాజకీయ విమర్శలతో పోల్చలేమని సోనియా గాంధీ చెప్పినట్లుగా ఈ సారాంశం పేర్కొంటోంది. ప్రేమించిన వ్యక్తిని కోల్పోయిన బాధకు కాలం కూడా మందు కాలేదు... రాజీవ్ జ్ఞాపకాలతోనే జీవితాన్ని కొనసాగించిన సోనియా గాంధీ కథలో విషాదం, త్యాగం, బాధ్యత.

# గుట్టుచప్పుడు కాకుండా రాసలీలలు..?

**మహిళా కానిస్టేబుల్ సంచలన ఆరోపణలు**




**జై భీమ్ క్రైం (హైదరాబాద్)**

పోలీస్ శాఖలో పనిచేస్తున్న ఓ ప్రొబేషనరీ ఎస్సైపై మహిళా కానిస్టేబుల్ సంచలన ఆరోపణలు చేసినట్లు సమాచారం. తనతో సన్నిహిత సంబంధం కొనసాగించి, పెళ్లి చేసుకుంటానని నమ్మించారని, ఈ క్రమంలో తాను మూడు సార్లు అబార్షన్ చేయించుకోవాల్సి వచ్చిందని బాధితురాలు ఆరోపిస్తున్నట్లు తెలుస్తోంది. తనకు న్యాయం చేయాలని కోరుతూ పలుమార్లు పోలీసు ఉన్నతాధికారులను ఆశ్రయించినప్పటికీ ఇప్పటివరకు న్యాయం జరగలేదని ఆమె వాపోతున్నట్లు సమాచారం. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు లేకపోవడంతో చివరకు తనకు న్యాయం ఎవరు చేస్తారనే ప్రశ్నను బాధితురాలు లేవనెత్తుతున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా, ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రొబేషనరీ ఎస్సై త్వరలో వివాహం చేసుకోబోతున్నారనే ప్రచారం ఈ వ్యవహారంపై మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఒకవైపు పోలీసు శాఖలోనే పనిచేస్తున్న మహిళా ఉద్యోగి న్యాయం కోసం అధికారుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందనే ఆరోపణలు, మరోవైపు ఫిర్యాదులపై చర్యలు తీసుకోలేదనే వాదనలు పోలీసు శాఖలో చర్చనీయాంశంగా మారుతున్నాయి. మహిళా ఉద్యోగి చేసిన ఆరోపణల్లో వాస్తవం ఎంత? ఆమె అధికారులకు ఎప్పుడు, ఎక్కడ ఫిర్యాదు చేసింది? ఆ ఫిర్యాదులపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకున్నారు? ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎస్సై వాదన ఏమిటి? అనే అంశాలపై సమగ్ర విచారణ జరగాల్సిన అవసరం ఉంది. ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని, అదే సమయంలో ఆరోపణలు నిరాధారమైతే వాస్తవాలను అధికారికంగా వెల్లడించి అనుమానాలకు తెరదించాలని ప్రజలు కోరుతున్నారు. పోలీస్ అధికారులే న్యాయం చేయకపోతే సామాన్యుల పరిస్థితి ఏమిటనే ప్రశ్న ఇప్పుడు ప్రధానంగా మారింది. ఈ వ్యవహారానికి సంబంధించిన ఫిర్యాదులు, అందుబాటులో ఉన్న ఆధారాలు, అధికారుల స్పందనతో పూర్తి వివరాలను జై భీమ్ దినపత్రిక త్వరలో ప్రత్యేక కథనంగా అందించనుంది.

# బడిలో భయం వద్దు.. అనురాగమే ముద్దు!








**దండనా సంస్కృతికి చరమగీతం పాడాలి..**

**పసి మనసులకు ప్రేమతో కూడిన విద్యే అవసరం**

**డాక్టర్ బరిగెల శివ**

**విశాఖపట్నం (జై భీమ్ న్యూస్)**

పాఠశాల అంటే పిల్లల్లో భయాన్ని నింపే ప్రదేశం కాదు.. వారి కుతూహలాన్ని పెంచి, జ్ఞానాన్ని అందించే ఆత్మీయ వేదిక. కానీ కొన్ని పాఠశాలల్లో కొనసాగుతున్న దండనా సంస్కృతి పసి మనసులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. విశాఖలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో హోంవర్క్ చేయలేదన్న కారణంగా ఆరేళ్ల బాలుడు ప్రణయ్ తేజ్ మృతి చెందిన ఘటన తీవ్ర ఆవేదనకు గురిచేస్తోంది. ఈ ఘటనపై వెలుగులోకి వచ్చిన సీసీటీవీ దృశ్యాలు, పాఠశాలల్లో పిల్లల భద్రతపై మరోసారి తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. కుటుంబ ప్రయాణం అనంతరం తీవ్ర అలసటతో ఉన్న చిన్నారిని పాఠశాలకు పంపడం తల్లిదండ్రుల వైపు జాగ్రత్త లోపంగా భావించినా, తరగతి గదిలో భయంతో వణికిపోతున్న బాలుడిని ఓదార్చాల్సిన సమయంలో దండనకు గురిచేయడం అత్యంత ఆందోళనకరమైన అంశంగా మారింది. బాలుడు తీవ్ర భయాందోళనకు గురై స్పృహ కోల్పోయినట్లు వచ్చిన వివరాలు హృదయవిదారకంగా ఉన్నాయి. అయితే మృతికి ఖచ్చితమైన వైద్య కారణాన్ని అధికారిక వైద్య నివేదికల ఆధారంగానే నిర్ధారించాల్సి ఉంది.

### పసి మనసులపై భయం ప్రభావం

చిన్నారుల మానసిక వికాస దశలో భయం, అవమానం, శారీరక దండన వంటి అనుభవాలు తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. హోంవర్క్ చేయకపోవడం, పరీక్షల్లో తక్కువ మార్కులు రావడం వంటి కారణాలతో పిల్లలను కొట్టడం లేదా బెదిరించడం ద్వారా విద్యను నేర్పలేం. అలాంటి చర్యలు పిల్లల్లో పాఠశాలంటేనే భయం ఏర్పడే పరిస్థితికి దారితీయవచ్చు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో గతంలోనూ పాఠశాలల్లో శారీరక, మానసిక వేధింపులకు సంబంధించిన విషాద ఘటనలు వెలుగులోకి వచ్చాయి. దీంతో పాఠశాలల్లో బాలల భద్రత, ఉపాధ్యాయుల ప్రవర్తన, యాజమాన్యాల పర్యవేక్షణపై కఠిన చర్యల అవసరం మరింత స్పష్టమవుతోంది.

### చట్టం ఉన్నా.. అమలు ఎంతవరకు?

పిల్లలను శారీరకంగా శిక్షించడం, మానసికంగా వేధించడం నిషేధించే నిబంధనలు ఇప్పటికే అమల్లో ఉన్నాయి. విద్యాహక్కు చట్టంలోని సెక్షన్ 17 పాఠశాలల్లో పిల్లలను శారీరక శిక్షకు, మానసిక వేధింపులకు గురిచేయడాన్ని నిషేధిస్తుంది. అయినప్పటికీ కొన్ని చోట్ల నిబంధనలు అమలు కాకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ప్రతి పాఠశాలలో పిల్లలకు సురక్షితమైన వాతావరణం కల్పించడంతో పాటు ఫిర్యాదు వ్యవస్థ, కౌన్సెలింగ్, పాఠశాల సిబ్బందికి బాలల మనస్తత్వంపై శిక్షణ వంటి చర్యలు సమర్థంగా అమలు కావాలి. సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయడం మాత్రమే కాకుండా, వాటి పర్యవేక్షణకు కూడా స్పష్టమైన వ్యవస్థ ఉండాలి.

### ఉపాధ్యాయుడు అంటే భయం కాదు.. భరోసా

ఒక ఉపాధ్యాయుడి చేతిలోని పుస్తకం పిల్లల భవిష్యత్తును మార్చగలదు. అదే చేతిలో దండన ఉంటే పసి మనసులో జీవితాంతం మిగిలిపోయే భయాన్ని కూడా నింపగలదు. అందుకే ఉపాధ్యాయులు పిల్లల తప్పులను శిక్షలతో కాకుండా ఓర్పుతో సరిదిద్దాలి. తల్లిదండ్రులు కూడా పిల్లల అలసట, మానసిక స్థితి, భయాలు, పాఠశాల అనుభవాలను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలి. పాఠశాల యాజమాన్యాలు చిన్నారుల భద్రత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదు. ప్రణయ్ తేజ్ వంటి విషాద ఘటనలు మరోసారి పునరావృతం కాకుండా ఉండాలంటే పాఠశాలల్లో భయానికి కాదు.. అనురాగానికి, దండనకు కాదు.. అవగాహనకు, ఒత్తిడికి కాదు.. ఆత్మీయతకు స్థానం కల్పించాలి. బడి అంటే భయపడే ప్రదేశం కాదు.. భవిష్యత్తును నిర్మించుకునే పవిత్రమైన స్థలం కావాలి.

జై భీమ్
తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
Jai Bheem

# ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే క్రిమినల్ కేసులా?

**జర్నలిస్టుల హక్కులపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు**
**విమర్శనాత్మక కథనాలపై క్రిమినల్ కేసులు సరికాదు..**
**భావప్రకటన స్వేచ్ఛను గౌరవించాలి**

**న్యూఢిల్లీ, 20 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

ప్రభుత్వ విధానాలు, అధికారుల పనితీరుపై విమర్శనాత్మకంగా వార్తలు, కథనాలు ప్రచురించినంత మాత్రాన జర్నలిస్టులపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం సరికాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ప్రజాస్వామ్య వ్యవస్థలో భావప్రకటన స్వేచ్ఛకు అత్యంత ప్రాధాన్యత ఉందని, ప్రభుత్వాన్ని ప్రశ్నించడం, విధానాలపై విమర్శలు చేయడం కూడా రాజ్యాంగం కల్పించిన హక్కుల్లో భాగమేనని పేర్కొంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఏ) కింద జర్నలిస్టుల భావప్రకటన హక్కులకు రక్షణ ఉందని ధర్మాసనం స్పష్టం చేసింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన జర్నలిస్టు అభిషేక్ ఉపాధ్యాయ్ తనపై నమోదైన ఎఫ్‌ఐఆర్‌ను రద్దు చేయాలని కోరుతూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వంలోని అధికారుల నియామకాల్లో కుల సమీకరణాలకు సంబంధించిన అంశాలపై ఆయన రాసిన కథనం నేపథ్యంలో ఎఫ్‌ఐఆర్ నమోదైనట్లు పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌ను జస్టిస్ హృషికేష్ రాయ్, జస్టిస్ ఎస్.వీ.ఎన్. భట్టి ధర్మాసనం విచారించింది. విచారణ సందర్భంగా ప్రభుత్వంపై విమర్శనాత్మకంగా ఉన్న కథనాన్ని ప్రచురించారనే ఒక్క కారణంతోనే జర్నలిస్టుపై క్రిమినల్ కేసు నమోదు చేయడం సమర్థనీయం కాదని ధర్మాసనం పేర్కొంది. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ నిర్ణయాలు, విధానాలు, అధికారుల పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తడం, భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేయడం సహజమైన ప్రక్రియ అని తెలిపింది. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడం, అధికార వ్యవస్థను ప్రశ్నించడం, ప్రజలకు సమాచారాన్ని అందించడం మీడియా బాధ్యతల్లో భాగమని పేర్కొంది. కేవలం ప్రభుత్వానికి అనుకూలంగా లేని అభిప్రాయం వ్యక్తం చేశారనే కారణంతో జర్నలిస్టులపై క్రిమినల్ చర్యలకు దిగడం భావప్రకటన స్వేచ్ఛపై ప్రభావం చూపే అవకాశం ఉందని కోర్టు వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ప్రభుత్వ విధానాలను విమర్శించే ప్రతి కథనాన్ని నేరపూరిత చర్యగా పరిగణించకూడదని, జర్నలిస్టులపై చట్టపరమైన చర్యలు తీసుకునే సమయంలో రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేసింది. ఈ సందర్భంగా అభిషేక్ ఉపాధ్యాయ్‌కు సుప్రీంకోర్టు మధ్యంతర రక్షణ కల్పించింది. సంబంధిత కథనానికి సంబంధించి ఆయనపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోరాదని ధర్మాసనం ఆదేశించింది. దీంతో పిటిషనర్‌కు తాత్కాలిక న్యాయపరమైన రక్షణ లభించింది. ప్రజాస్వామ్యంలో స్వేచ్ఛాయుత మీడియా కీలక పాత్ర పోషిస్తుందని న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు. ప్రభుత్వ



నిర్ణయాలు, విధానాలు, ప్రజా సమస్యలపై ప్రశ్నలు లేవనెత్తడం ద్వారా మీడియా ప్రజలకు సమాచారాన్ని అందిస్తుందని, ఈ క్రమంలో విమర్శనాత్మక కథనాలు వెలువడటం సహజమని అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వాన్ని విమర్శించే ప్రతి కథనాన్ని నేరంగా పరిగణించకుండా, కథనం స్వభావం, ప్రజా ప్రయోజనం, రాజ్యాంగ హక్కులు వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉందన్న సందేశం ఈ కేసులో సుప్రీంకోర్టు వ్యాఖ్యల ద్వారా వెలువడింది. అధికారంలో ఉన్న వారిని ప్రశ్నించడం ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగమని, భిన్నాభిప్రాయాలను అణచివేయడం కంటే వాటిపై చర్చించి సమాధానం ఇవ్వడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి అనుగుణంగా ఉంటుందని పరిశీలకులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో జర్నలిస్టుల భావప్రకటన స్వేచ్ఛ, మీడియా స్వేచ్ఛకు రాజ్యాంగ రక్షణ ఉందని సుప్రీంకోర్టు మరోసారి స్పష్టం చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## మాతృ మరణాల నివారణకు ప్రత్యేక చర్యలు

**హైరిస్క్ గర్భిణీలపై ప్రత్యేక శ్రద్ధ: డీఎంహెచ్ఓ డాక్టర్ ఏ. అప్పయ్య**



**హన్మకొండ, 20 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

గర్భిణీలకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించడంతోపాటు, హైరిస్క్ లక్షణాలు ఉన్న గర్భిణీలపై ప్రత్యేక శ్రద్ధ చూపితే మాతృ మరణాలను నివారించవచ్చని హనుమకొండ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఏ. అప్పయ్య అన్నారు. గురువారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో జిల్లాలో ఈ ఏడాది సంభవించిన మూడు మాతృ మరణాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒక్కో మాతృ మరణానికి గల కారణాలను అధికారులు, వైద్య నిపుణులు సమగ్రంగా విశ్లేషించారు. వైద్య సేవల్లో ఎక్కడైనా లోపాలు జరిగాయా? వాటిని ఎలా సరిదిద్దాలి? భవిష్యత్‌లో మాతృ మరణాలు సంభవించకుండా ఎలాంటి చర్యలు చేపట్టాలనే అంశాలపై చర్చించారు. ప్రతి కేసును గైనకాలజిస్ట్, అనస్థీషియస్ట్, సంబంధిత వైద్యాధికారి, సూపర్‌వైజర్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తల సమక్షంలో సమీక్షించారు. గర్భిణీ నమోదు, ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో నిర్వహించిన వైద్య పరీక్షలు, 108 సేవల వినియోగం, ఉన్నత స్థాయి ఆసుపత్రుల్లో అందించిన వైద్య సేవలు తదితర అంశాలను పరిశీలించారు. మాతృ మరణాన్ని నివారించే అవకాశం ఉందా లేదా అనే అంశంపైనా లోతుగా చర్చించారు. గర్భం నిర్ధారణ అయిన వెంటనే, ముఖ్యంగా మొదటి త్రైమాసికంలోనే గర్భిణీ పేరును నమోదు చేయాలని నిపుణులు సూచించారు. వైద్యాధికారి ఆధ్వర్యంలో ప్రారంభ పరీక్షలు నిర్వహించడంతోపాటు, మూడో, నాలుగో చెకప్‌లను గైనకాలజీ వంటి ప్రత్యేక నిపుణుల సేవలు అందుబాటులో ఉన్న ఆసుపత్రుల్లో తప్పనిసరిగా చేయించాలని తెలిపారు. హైరిస్క్ గర్భిణీలను ముందుగానే గుర్తించి తగిన వైద్య సేవలు అందించడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చని పేర్కొన్నారు. మాతా శిశు సంరక్షణ కార్డులోని ముఖ్యమైన సమాచారాన్ని గర్భిణీలకు వివరించడంతోపాటు, వారు కూడా ఆ సమాచారాన్ని చదివి అవగాహన పెంచుకునేలా చూడాలని సూచించారు. సమావేశంలో మాతా శిశు సంక్షేమ కార్యక్రమ అధికారి డాక్టర్ రజిత, ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి అసోసియేట్ ప్రొఫెసర్ లక్ష్మీరెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ప్రదీప్‌రెడ్డి, పరకాల ఏరియా ఆసుపత్రి అనస్థీషియస్ట్ డాక్టర్ నారాయణరెడ్డి, వైద్యాధికారులు డాక్టర్ నాగరాజు, డాక్టర్ మునీర్, డాక్టర్ హైదర్, జిల్లా మాస్ మీడియా అధికారి వి. అశోక్‌రెడ్డి, స్టాటిస్టికల్ అధికారి విజయలక్ష్మి, డాక్టర్ మౌనిక, హెల్త్ సూపర్‌వైజర్లు పద్మజ, మరియా థామస్, అమృత, సంబంధిత ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆంటీ ర్యాగింగ్, ఆంటీ డ్రగ్స్ క్యాంపస్‌గా కేయూ ఉండాలి

**విద్యార్థులకు లైఫ్ స్కిల్స్, చట్టాలపై అవగాహన అవసరం: డాక్టర్ అనితా రెడ్డి**

**వరంగల్, 20 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**





విద్యార్థులకు చదువుతోపాటు లైఫ్ స్కిల్స్, చట్టాలు, పాజిటివ్ థింకింగ్, మంచి నడవడికపై అవగాహన అవసరమని కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యురాలు, అనురాగ్ సొసైటీ చైర్మన్, మోటివేషనల్ స్పీకర్ డాక్టర్ అనితా రెడ్డి అన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం ఆంటీ ర్యాగింగ్, ఆంటీ డ్రగ్స్ క్యాంపస్‌గా నిలవాలని, ఇందుకోసం విద్యార్థులు, అధ్యాపకులు, అధికారులు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. కాకతీయ విశ్వవిద్యాలయం కో-ఎడ్యుకేషన్ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ రమణ ఆధ్వర్యంలో గురువారం లైఫ్ స్కిల్స్, పాజిటివ్ థింకింగ్, చట్టాలు, ఆంటీ ర్యాగింగ్ తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ అనితా రెడ్డి మొదటి సంవత్సరం విద్యార్థులతో స్నేహపూర్వకంగా మాట్లాడి పలు అంశాలపై అవగాహన కల్పించారు. కళాశాల విద్యార్థులకు కేవలం విద్యా, సాంకేతిక నైపుణ్యాలను మాత్రమే కాకుండా జీవిత విలువలను కూడా నేర్పిస్తుందనే భరోసా కల్పించాలని ఆమె అన్నారు. విద్యార్థులు తమ సమస్యలను తామే పరిష్కరించుకునే స్థాయికి ఎదగాలని, చదువుతోపాటు మంచి నడవడికను అలవర్చుకోవాలని సూచించారు. జీవితంలో ఒక లక్ష్యాన్ని ఏర్పరుచుకుని దానిని సాధించే దిశగా కష్టపడి చదవాలని, తోటి విద్యార్థులతో స్నేహభావంతో మెలగాలని అన్నారు. జీవితంలో ఎదురయ్యే సమస్యలను ధైర్యంగా ఎదుర్కొనే మానసిక స్థైర్యాన్ని కలిగి ఉండటమే నిజమైన నైపుణ్యమని పేర్కొన్నారు. ప్రతి చిన్న సమస్యకూ భయపడి ఆత్మహత్యల వైపు మళ్లవద్దని విద్యార్థులకు సూచించారు. తోటి విద్యార్థులను మానసికంగా, శారీరకంగా, భావోద్వేగపరంగా లేదా మరే విధంగానైనా ఇబ్బంది పెట్టడం ర్యాగింగ్ కిందకే వస్తుందని డాక్టర్ అనితా రెడ్డి స్పష్టం చేశారు. ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి కళాశాలలో ఆంటీ ర్యాగింగ్ కమిటీ, పోష్ ఇంటర్నల్ కమిటీలను ఏర్పాటు చేసి విద్యార్థులకు సురక్షితమైన వాతావరణం కల్పించాలని సూచించారు. ప్రేమ పేరుతో ఎంతో మంది యువత తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, విద్యార్థులు అలాంటి పరిస్థితులకు దూరంగా ఉండాలని సూచించారు. కళాశాలలో ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని, అవసరమైతే తన దృష్టికి కూడా తీసుకురావచ్చని తెలిపారు. కాకతీయ విశ్వవిద్యాలయం ఆంటీ ర్యాగింగ్, ఆంటీ డ్రగ్స్ క్యాంపస్‌గా మారేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డాక్టర్ అనితా రెడ్డి పిలుపునిచ్చారు. డ్రగ్స్, ర్యాగింగ్ వంటి సామాజిక సమస్యలకు విద్యార్థులు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన విద్యా వాతావరణం ఏర్పాటుకు భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రమణ, కల్పన, ప్రొఫెసర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అంబాల గ్రామంలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలి

**విద్యార్థులు, ఉద్యోగార్థులు, యువత, రైతులకు ఉపయోగపడేలా సౌకర్యాలు కల్పించాలి: జేరిపోతుల రాజేందర్**

**కమలాపూర్, 20 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**



అంబాలగ్రామంలోని విద్యార్థులు, ఉద్యోగార్థులు, యువత, రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అంబాల గ్రామంలో గ్రంథాలయం ఏర్పాటు చేసి ప్రారంభించాలని బీజేపీ మండల ఎస్సీ మోర్చా అధ్యక్షుడు జేరిపోతుల రాజేందర్ కోరారు. ఈ మేరకు అంబాల గ్రామ సర్పంచ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ గ్రామంలో విద్యార్థులు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువత చదువుకునేందుకు అనువైన వాతావరణంతో పాటు అవసరమైన పుస్తకాలు, చదువు సామగ్రి అందుబాటులో ఉండేలా గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. గ్రంథాలయంలో పాఠ్యపుస్తకాలు, సాధారణ జ్ఞానం, ప్రస్తుత విషయాలు, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు, పోలీస్, బ్యాంకింగ్, గ్రూప్స్ తదితర పరీక్షల పుస్తకాలు అందుబాటులో ఉంచాలని కోరారు. రోజువారీ దినపత్రికలు, వార, మాస పత్రికలు కూడా అందుబాటులో ఉంచి విద్యార్థులు, యువతకు ఉపయోగపడేలా గ్రంథాలయాన్ని తీర్చిదిద్దాలని సూచించారు. ప్రశాంతమైన వాతావరణంలో చదువుకునేందుకు టేబుళ్లు, కుర్చీలు, విద్యుత్, వెలుతురు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని అన్నారు. అలాగే గ్రామంలోని రైతులకు ఉపయోగపడేలా వ్యవసాయ పత్రికలు, ఆధునిక వ్యవసాయ పద్ధతులు, పంటల సాగు విధానాలు, సేంద్రీయ వ్యవసాయం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, పంటల మార్కెట్ ధరలు, ప్రభుత్వ వ్యవసాయ పథకాలు, రాయితీలు తదితర అంశాలకు సంబంధించిన పుస్తకాలు, సమాచారాన్ని అందుబాటులో ఉంచాలని తెలిపారు. వ్యవసాయ రంగంలో వస్తున్న నూతన పద్ధతులపై రైతులు అవగాహన పెంచుకుంటే సాగు ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు దిగుబడి, ఆదాయాన్ని పెంచుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. గ్రామంలో గ్రంథాలయం అందుబాటులోకి వస్తే పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు, యువతకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని, ఖరీదైన శిక్షణ కేంద్రాలకు వెళ్లలేని వారికి పోటీ పరీక్షలకు స్వయంగా సిద్ధమయ్యే అవకాశం కలుగుతుందని రాజేందర్ అన్నారు. యువత చదువుపై దృష్టి సారించి ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాల దిశగా ముందుకు సాగేందుకు గ్రంథాలయం చైతన్య కేంద్రంగా ఉపయోగపడుతుందని తెలిపారు. "విద్యార్థుల భవిష్యత్తు--యువతకు ఉద్యోగ అవకాశాలు--రైతుల అభివృద్ధి" అనే లక్ష్యంతో అంబాల గ్రామంలో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసి అవసరమైన పుస్తకాలు, పత్రికలు, పోటీ పరీక్షల చదువు సామగ్రి, వ్యవసాయ సమాచారాన్ని అందుబాటులోకి తీసుకురావాలని సర్పంచ్‌ను కోరారు. గ్రామ ప్రజలు, దాతలు, యువత సహకారంతో గ్రంథాలయాన్ని మరింత అభివృద్ధి చేసే అవకాశం ఉందని తెలిపారు. గ్రామ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని సర్పంచ్ సానుకూలంగా స్పందించి త్వరితగతిన గ్రంథాలయం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని జేరిపోతుల రాజేందర్ విజ్ఞప్తి చేశారు.

## రాజీవ్ గాంధీ ఆశయాలతో దేశాభివృద్ధికి కృషి చేయాలి



**ఆత్మకూర్, 20 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

ప్రపంచ దేశాలకు దీటుగా భారతదేశాన్ని అభివృద్ధి చేయాలనే దృఢ సంకల్పంతో ఐటీ, టెలికాం రంగాల్లో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన మాజీ ప్రధానమంత్రి, భారతరత్న రాజీవ్ గాంధీ అని పరకాల నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మాదాసి శ్రీధర్ అన్నారు. గురువారం ఆత్మకూరు మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రేవూరి జలంధర్‌రెడ్డి ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ 82వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, కేక్ కట్ చేశారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాదాసి శ్రీధర్ మాట్లాడుతూ దేశ సంక్షేమం, అభివృద్ధి కోసం మాజీ ప్రధానమంత్రులు నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీలు విశేష కృషి చేశారని అన్నారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి బ్యాంకుల జాతీయీకరణ వంటి నిర్ణయాలు, గ్రామీణ అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వాలకు దక్కుతుందన్నారు. 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించడం, గ్రామాల అభివృద్ధికి అనుగుణంగా చట్టాల్లో మార్పులు తీసుకురావడం, ఐటీ, టెలికాం రంగాలను అభివృద్ధి చేయడం రాజీవ్ గాంధీ దూరదృష్టికి నిదర్శనమన్నారు. రాజీవ్ గాంధీ కన్న కలలను, ఆయన ఆశయాలను యువత కొనసాగించాలని పిలుపునిచ్చారు. పరకాల నియోజకవర్గం అభివృద్ధికి ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ప్రభుత్వం నుంచి పెద్దఎత్తున నిధులు తీసుకువచ్చి అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని శ్రీధర్ అన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్యేను విమర్శించే నైతిక హక్కు ఎవరికీ లేదని పేర్కొన్నారు. జరుగుతున్న అభివృద్ధిని చూసి పార్టీలకు అతీతంగా ఎమ్మెల్యేకు ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను యువత ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు మార్క రజనీకర్, కక్కెర్ల రాధిక రాజు, చిదిరాల శ్రీనివాస్‌రెడ్డి, గ్రామ అధ్యక్షుడు తాళ్ల కిరణ్, సర్పంచులు ఎలుకటి రవి, మౌలా, అప్పారావు, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు రేవూరి జయపాల్‌రెడ్డి, సీనియర్ నాయకులు ఉప్పల సుదర్శన్, కోల రమేష్, కాడబోయిన రవి, వడ్డేపల్లి ప్రసాద్, గుండెబోయిన శ్యామ్, కోల రంపాల్, సతీష్, మంతుర్తి రవి, అలవాల రవి, యూత్ నాయకులు మహమ్మద్ కరీం, షరీఫ్, రాజిరెడ్డి, వివిధ గ్రామాల ఉపసర్పంచులు, మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఖేలో ఇండియా కార్యక్రమంలో పాల్గొనండి

**కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ ప్రభుత్వం ఆహ్వానం**
**డిసెంబర్ 11 నుంచి 22 వరకు ఖేలో ఇండియా కార్యక్రమం**
**కేంద్రమంత్రి మన్సుఖ్ మాండవీయాను మంత్రి వాకిటి శ్రీహరి ఆహ్వానం**

**న్యూఢిల్లీ,ఆగస్ట్20(జై భీమ్ న్యూస్):**

తెలంగాణలో డిసెంబర్ 11 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించనున్న ఖేలో ఇండియా కార్యక్రమంలో పాల్గొనాలని కేంద్ర ప్రభుత్వాన్ని తెలంగాణ ప్రభుత్వం ఆహ్వానించింది. ఈ మేరకు రాష్ట్ర పశుసంవర్ధక, పాడిపారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు / క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ శివసేనారెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ వీసీ / ఎండీ సోనిబాలాదేవి న్యూఢిల్లీలో కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయాను కలిసి కార్యక్రమానికి హాజరు కావాలని ఆహ్వానించారు. తెలంగాణలో క్రీడా రంగాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు యువ క్రీడాకారులకు జాతీయ స్థాయిలో మెరుగైన అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఖేలో ఇండియా కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి తెలంగాణను దేశ క్రీడా పటంలో మరింత బలమైన రాష్ట్రంగా నిలిపేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. ల్గ÷లో ఇండియా కార్యక్రమ నిర్వహణ కోసం తెలంగాణను ఎంపిక చేసినందుకుగాను మంత్రి వాకిటి శ్రీహరి కేంద్రానికి ధన్యవాదాలు తెలిపారు.

# చదువుకున్న బడికి రుణం తీర్చుకున్న ఎన్ఆర్ఐ దంపతులు





### తల్లిదండ్రుల జ్ఞాపకార్థం అంబాల జెడ్పీహెచ్ఎస్‌కు అభివృద్ధి పనులు

### పాఠశాల ఆవరణకు రంగులు.. విద్యార్థులకు వాటర్ ప్యూరిఫైర్ విరాళం

**హన్మకొండ జిల్లా/అంబాల, 20 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

తాము చదువుకున్న పాఠశాల తమ జీవితానికి పునాది వేసిందనే కృతజ్ఞతతో, పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందించేందుకు ఎన్ఆర్ఐ కంచనకుంట్ల వెంకట్రామ్ రెడ్డి, సుధా దంపతులు ముందుకొచ్చారు. తమ స్నేహితుడు కే.వి. నారాయణ సహకారంతో, తమ తల్లిదండ్రులు కీ.శే. లక్ష్మీనరసమ్మ, వెంకటరెడ్డి జ్ఞాపకార్థం అంబాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. పాఠశాల ఆవరణకు రంగులు వేయించడంతో పాటు విద్యార్థులకు పరిశుభ్రమైన తాగునీరు అందించేందుకు వాటర్ ప్యూరిఫైర్‌ను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా కంచనకుంట్ల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ, "నీ దేశం నీ కోసం ఏమి చేయగలదని అడగకు.. నీ దేశం కోసం నువ్వు ఏమి చేయగలవో అడుగు" అనే మహోన్నత సందేశం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమన్నారు. ఇదే స్ఫూర్తితో తాము చదువుకున్న పాఠశాల తమకు ఏమిచ్చిందనే దానికంటే, తాము చదువుకున్న పాఠశాలకు ఏమి చేయగలమనే ఆలోచనతో ఈ సేవా కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. పాఠశాల తమ జీవితంలో ఎంతో ముఖ్యమైన పాత్ర పోషించిందని, ఇక్కడ పొందిన విద్య, క్రమశిక్షణ, విలువలు తమ జీవితాన్ని తీర్చిదిద్దడంలో ఎంతో ఉపయోగపడ్డాయని చెప్పారు. తాము ఈ స్థాయికి ఎదగడంలో పాఠశాల, ఉపాధ్యాయుల పాత్ర మరువలేనిదని పేర్కొన్నారు. జీవితంలో స్థిరపడిన తర్వాత తాము చదువుకున్న పాఠశాలకు, తమ గ్రామానికి తమ వంతు సేవ చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. తమ తల్లిదండ్రులు కీ.శే. లక్ష్మీనరసమ్మ, వెంకటరెడ్డి జ్ఞాపకార్థం పాఠశాలకు సేవ చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు భవిష్యత్తులోనూ తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. సుధా రెడ్డి మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి విద్యకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ కష్టపడి చదువుకోవాలని సూచించారు. విద్య మనిషి జీవితాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దే గొప్ప సాధనమని, పేదరికం లేదా ఆర్థిక ఇబ్బందులు విద్యాభ్యాసానికి అడ్డంకులు కాకూడదని అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని ఆకాంక్షించారు. తాము చదువుకున్న పాఠశాలలో ప్రస్తుత విద్యార్థులకు ఉపయోగపడే విధంగా సేవ చేయడం తమకు ఎంతో సంతృప్తినిచ్చిందని తెలిపారు. పూర్వ విద్యార్థులు తమకు సాధ్యమైనంత మేర పాఠశాలల అభివృద్ధికి సహకరిస్తే విద్యార్థులకు మరింత మెరుగైన వసతులు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని కోరారు. రమణ రెడ్డి మాట్లాడుతూ, గురజాడ అప్పారావు చెప్పిన "వట్టి మాటలు కట్టిపెట్టోయ్.. గట్టి మేలు తలపెట్టవోయ్" అనే సందేశాన్ని ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని అన్నారు. కేవలం మాటలకు పరిమితం కాకుండా సమాజానికి ఉపయోగపడే పనులు చేయాల్సిన అవసరం ఉందన్నారు. తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. పాఠశాలలోని విద్యార్థినీ విద్యార్థులకు త్వరలో పీఈటీ డ్రెస్సులు అందజేస్తానని తెలిపారు. ఈ పాఠశాల నుంచి ఎంతో మంది విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి డాక్టర్లు, ఇంజినీర్లు, పోలీసులు తదితర రంగాల్లో స్థిరపడి సమాజానికి సేవలు అందిస్తున్నారని అన్నారు. విద్యార్థుల చదువుతో పాటు శారీరక దృఢత్వం, క్రీడలపై ఆసక్తి పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. పాఠశాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు. ఉమాదేవి మాట్లాడుతూ, చదువుతో జీవితంలో ఏదైనా సాధించవచ్చని అన్నారు. తాము చదువుకోలేకపోయామని, ఆ లోటు తమకు ఇప్పటికీ బాధగా ఉందని పేర్కొన్నారు. అందుకే ప్రస్తుత విద్యార్థులు తమకు లభిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని బాగా చదువుకోవాలని సూచించారు. ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని కష్టపడి చదివితే మంచి భవిష్యత్తును నిర్మించుకోవచ్చని తెలిపారు. విద్యార్థుల చదువుకు అవసరమైన సహాయం అందించేందుకు దాతలు, పూర్వ విద్యార్థులు ముందుకు రావాలని కోరారు. కమలాపూర్ ఇన్‌స్పెక్టర్ నవీన్ కుమార్ మాట్లాడుతూ, తాము చదువుకున్న పాఠశాలకు తిరిగి వచ్చి విద్యార్థుల కోసం సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఎన్ఆర్ఐ దంపతులు పాఠశాల అభివృద్ధికి అందించిన సహకారం ఇతర పూర్వ విద్యార్థులకు కూడా స్ఫూర్తిగా నిలుస్తుందని అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని తల్లిదండ్రులకు, గ్రామానికి, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. తమకు ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. వైస్ చైర్మన్ ఐలయ్య మాట్లాడుతూ, తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి ఎన్ఆర్ఐ దంపతులు ముందుకు వచ్చి సేవ చేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాలకు రంగులు వేయించడంతో పాటు విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు వాటర్ ప్యూరిఫైర్ అందించడం ఎంతో ఉపయోగకరమన్నారు. పూర్వ విద్యార్థులు తమ విద్యాసంస్థను మరచిపోకుండా పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని కోరారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు



మరింతగా కొనసాగాలని ఆకాంక్షించారు. గ్రామ సర్పంచ్ కుమ్మరి కుమారస్వామి మాట్లాడుతూ, అంబాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి కంచనకుంట్ల వెంకట్రామ్ రెడ్డి, సుధా దంపతులు అందించిన సహకారం గ్రామానికి గర్వకారణమన్నారు. తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం పాఠశాలకు సేవ చేయడం ద్వారా వారు ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. పాఠశాల అభివృద్ధికి గ్రామపంచాయతీ తరఫున కూడా అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. గ్రామంలోని పూర్వ విద్యార్థులు, దాతలు కూడా పాఠశాల అభివృద్ధికి ముందుకు రావాలని కోరారు. పాఠశాల అభివృద్ధికి ఎన్ఆర్ఐ దంపతులు అందించిన సహకారాన్ని ఉపాధ్యాయులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, గ్రామస్థులు అభినందించారు. తాము చదువుకున్న పాఠశాలను మరచిపోకుండా, తాము ఎదిగిన తర్వాత విద్యార్థుల భవిష్యత్తు కోసం వసతులు కల్పించడం అభినందనీయమని పేర్కొన్నారు. పూర్వ విద్యార్థులు, దాతలు ఇలాంటి కార్యక్రమాలను కొనసాగిస్తే పాఠశాలలో విద్యార్థులకు మరింత మెరుగైన వసతులు అందుబాటులోకి వస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. విద్యార్థుల ప్రతిభను చూసి దాతలు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు. విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు చదువుతో పాటు సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాలను ప్రోత్సహించాలని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గుర్రం వెంకటేశ్వర్లు, వార్డు సభ్యులు నాగేశ్వర్ రావు, ఎఫ్.ఎ. కిరణ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రోజా రాణి, ఉపాధ్యాయులు నరసింహారెడ్డి, సంపత్, శ్రీనివాస్, స్వరూపరాణి, భారతి, శ్రీలత, అంజూమ్, లక్ష్మి, సరస్వతి, రెహ్మాన్, ది నేషనల్ కన్స్యూమర్ రైట్స్ మీడియా కోఆర్డినేటర్ హనుమకొండ అనిల్ కాందారి, విద్యార్థినీ విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు. ఎన్ఆర్ఐ దంపతులు కంచనకుంట్ల వెంకట్రామ్ రెడ్డి, సుధా, వారి స్నేహితుడు కే.వి. నారాయణ అందించిన సహకారాన్ని పలువురు అభినందించారు. తాము విద్యనభ్యసించిన పాఠశాలకు తిరిగి వచ్చి విద్యార్థుల భవిష్యత్తు కోసం సేవ చేయడం ద్వారా వారు పూర్వ విద్యార్థులందరికీ ఆదర్శంగా నిలిచారని కొనియాడారు.

# ప్రాథమిక సౌకర్యాలు కల్పించాలని డిమాండ్



**బెంగళూరు జై భీమ్ న్యూస్ :**

కెంబతహల్లి గ్రామంలోని సర్వే నెం. 55లో ఇళ్లు కట్టుకున్న ప్రజలకు ప్రాథమిక సౌకర్యాలు కల్పించాలని కమిషనర్‌ను కోరినట్లు కేజేఎస్ మరియు భీమా సంఘటన మహా కూటమి రాష్ట్ర అధ్యక్షుడు కె. మరియప్ప తెలిపారు. ఆయన మాట్లాడుతూ బెంగళూరు సౌత్ తాలూకా, ఉత్తరహల్లి హోబ్లి, కెంబతహల్లి గ్రామంలోని సర్వే నెం. 55లో సుమారు 12 సంవత్సరాలుగా నివసిస్తున్నాము. ఇక్కడ ఇళ్లు కట్టుకున్న కుటుంబాలకు సదరు భూమిని కేటాయించాలంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వు జీబీఏ అధికారులకు చేరింది. ఈ విషయమై చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు జీబీఏ కార్యాలయానికి వచ్చారు. కమిషనర్ను కలిసి తమ సమస్యలు లబ్ధిదారులు తెలిపారు. ఆ భూమిలో తాగునీరు, విద్యుత్ కనెక్షన్‌తో సహా ప్రాథమిక సౌకర్యాలు కల్పించాలని కమిషనర్ ను కోరారు. కర్ణాటక సామరస్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు కన్నాలి కృష్ణప్ప మాట్లాడుతూ.. బెంగళూరు సౌత్ తాలూకా, ఉత్తరహల్లి హోబ్లీ, కెంబతహల్లి గ్రామంలో నివసిస్తున్న ప్రజలకు తాగునీరు, మురుగునీటి పారుదల వ్యవస్థ, వీధి దీపాలు మరియు ఇతర సౌకర్యాలతో సహా ప్రాథమిక సౌకర్యాలను కల్పించాలని హైకోర్టు ఆదేశించిందని తెలిపారు. 55 జంబుసవారి దిన్నె. 1640 2026 2.25 .బి.–బిబిఎంపి. పత్రాల పరిశీలనకు జిబిఎ అధికారులు స్పందించడం లేదని, కమిషనర్‌ను ఒప్పించేందుకు జంబుసవారి దిన్నె గ్రామంలోని లబ్ధిదారులు బెంగళూరు సౌత్ జోనల్ కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. వెంటనే, కెంబతహల్లి గ్రామ ప్రజలకు ప్రాథమిక సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ బెంగళూరు సౌత్ తాలూకా జిబిఎ కమిషనర్‌కు ఒక వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వివిధ సంఘాల నాయకులు సిద్దలింగప్ప, శంకర్ రామలింగయ్య, కోదండరామ్, గంగన్న, శకుంతలమ్మ, న్యాయవాదులు మునిగంగప్ప, రవి, కెంబతహల్లి ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## కొత్త క్రిమినల్ చట్టాలపై సమన్వయంతో సాగాలి

### పోలీసులు, న్యాయవ్యవస్థకు చీఫ్ జస్టిస్ సూచన

హైదరాబాద్,ఆగస్ట్20(జై భీమ్ న్యూస్):కొత్త చట్టాల అమలుకు పోలీసులు, న్యాయవ్యవస్థ, ప్రాసిక్యూషన్, ఫోరెన్సిక్, వైద్య, జైళ్ల శాఖల మధ్య బలమైన సమన్వయం అవసరమని తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ పేర్కొన్నారు. సంస్థలు సమన్వయంతో పనిచేసినప్పుడే బాధితులకు సత్వర న్యాయం అందుతుందని తెలిపారు. జస్టిస్ మౌషుమీ భట్టాచార్య కొత్త చట్టాల అమలులో డిజిటల్ లిటరసీ అత్యంత అవసరమని, డిజిటల్ ఎ÷–లాట్‌ఫామ్స్‌లో తప్పులు, డూప్లికేట్ డేటా ఎంట్రీ వల్ల కేసుల్లో జాప్యం జరుగుతోందని సూచించారు. కొత్త క్రిమినల్ చట్టాల డిజిటలైజ్డ్ అమలుపై తెలంగాణ స్టేట్ జ్యుడీషియల్ అకాడమీ, తెలంగాణ పోలీసుల ఆధ్వర్యంలో ప్రత్యేక సమగ్ర సమన్వయ సదస్సు నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1,200 మంది న్యాయ, పోలీస్, ప్రాసిక్యూషన్, జైళ్లు, ఫోరెన్సిక్, వైద్య శాఖల అధికారులు హైబ్రిడ్ విధానంలో సదస్సుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. 'కొత్త క్రిమినల్ చట్టాలు కేవలం పాత చట్టాల స్థానంలో వచ్చినవి మాత్రమే కాదు. సైంటిఫిక్ ఇన్వెస్టిగేషన్, డిజిటల్ ఎవిడెన్స్, ఎలక్ట్రానిక్ రికార్డులు, టైమ్ బౌండ్ ప్రొసీజర్స్‌కు ప్రాధాన్యం ఇస్తాయి' అని అన్నారు. డిజిటల్ ఎవిడెన్స్, డిజిటల్ కేస్ మేనేజ్‌మెంట్, నుంచి చార్జ్‌షీట్ వరకు ఆన్‌లైన్ ప్రక్రియలపై సదస్సులో ప్రజెంటేషన్లు ఇచ్చారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టు సాక్ష్యాలు, ఫోరెన్సిక్ మెడికల్ ఇంటర్‌ఫేస్‌లపై అవగాహన కల్పించారు. పోలీస్, ప్రాసిక్యూషన్, జైళ్ల శాఖల మధ్య సమాచార మార్పిడి మరింత వేగవంతం కావాలని డీజీపీ సూచించారు.

# పల్లె పల్లెకు పొన్నం అన్న.. ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారం

**ఎల్కతుర్తి, ఆగస్టు 20 (జై భీమ్ న్యూస్):**

గ్రామీణ ప్రాంతాల ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకొని వాటికి పరిష్కారం చూపడంతో పాటు ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించాలనే ఉద్దేశంతో 'పల్లె పల్లెకు పొన్నం అన్న' కార్యక్రమాన్ని చేపట్టినట్లు రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా గురువారం ఎల్కతుర్తి మండలంలోని కేశవాపూర్, రామకృష్ణాపూర్, తిమ్మాపూర్, గుంటూరుపల్లి, ఆరేపల్లి, బావుపేట గ్రామాల్లో మంత్రి పర్యటించి ప్రజలతో ముఖాముఖిగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని 173 గ్రామాలను పల్లె పల్లెకు పొన్నం అన్న కార్యక్రమం ద్వారా సందర్శించి, ప్రతి గ్రామంలోని ప్రజల సమస్యలు, గ్రామ అభివృద్ధికి అవసరమైన పనులు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును స్వయంగా తెలుసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. ప్రజలకు అవసరమైన సమస్యలను సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, రెవెన్యూ, వ్యవసాయం, వైద్య ఆరోగ్య, విద్యుత్, నీటిపారుదల, మిషన్ భగీరథ, మహిళా శిశు సంక్షేమం, పౌరసరఫరాలు, సంక్షేమ శాఖలు, విద్యాశాఖ, ఉపాధి హామీ, గ్రామపంచాయతీ అధికారులు ప్రజల సమస్యలను తెలుసుకొని తమ శాఖల పరిధిలో పరిష్కరించాల్సిన అంశాలను గుర్తించాలని మంత్రి సూచించారు. రెవెన్యూ అధికారులు భూ సమస్యలు, పట్టాదారు పాసుపుస్తకాలు, భూముల వివరాలు, ప్రభుత్వ భూములు, అర్హతకు సంబంధించిన సమస్యలను పరిశీలించి పరిష్కరించాల్సిన బాధ్యత తీసుకోవాలని సూచించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి అధికారులు గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీలు, పారిశుద్ధ్యం, వీధిలైట్లు, మురుగు కాలువలు, గ్రామీణ మౌలిక వసతుల సమస్యలను గుర్తించి చర్యలు చేపట్టాలని తెలిపారు వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు సాగు పద్ధతులు, పంటల సమస్యలు, ఆయిల్‌పామ్ సాగు, అంతర పంటలు, వ్యవసాయ పథకాలు, రైతులకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ ప్రోత్సాహకాలను వివరించాలని మంత్రి సూచించారు. ఆయిల్‌పామ్ సాగు ద్వారా రైతులకు దీర్ఘకాలికంగా కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని అన్నారు. గ్రామాల్లో వర్షపు నీటిని భూమిలోకి ఇంకేలా ఇంకుడుగుంతలు ఏర్పాటు చేసి భూగర్భ జలాలను పెంచేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. నీటి వనరుల సంరక్షణ, తాగునీటి సమస్యలు, మిషన్ భగీరథకు సంబంధించిన సమస్యలను సంబంధిత అధికారులు పరిశీలించి పరిష్కరించాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు గ్రామాల్లో ప్రజల ఆరోగ్య సమస్యలను గుర్తించి అవసరమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని, ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు మహిళలు, చిన్నారులు, వృద్ధులు తదితరులకు అందుతున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించి అర్హులైన వారికి ప్రయోజనాలు అందేలా చూడాలన్నారు. విద్యుత్ శాఖ అధికారులు గ్రామాల్లో విద్యుత్ సరఫరా, విద్యుత్ స్తంభాలు, లైన్లు, ఇతర సమస్యలను పరిశీలించి పరిష్కరించడంతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం అర్హులైన కుటుంబాలకు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యాశాఖ అధికారులు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, విద్యార్థుల సమస్యలు, పాఠశాల భవనాలు, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర అంశాలను పరిశీలించాలని మంత్రి తెలిపారు. పౌరసరఫరాల శాఖ అధికారులు రేషన్ కార్డులు, రేషన్ పంపిణీ, అర్హులైన కుటుంబాలకు అందాల్సిన ప్రయోజనాలపై ప్రజల నుంచి వివరాలు తెలుసుకొని సమస్యలను పరిష్కరించాలని సూచించారు. సంక్షేమ శాఖల అధికారులు వృద్ధాప్య, వితంతు, దివ్యాంగులు తదితర వివిధ రకాల పింఛన్లకు అర్హులైన వారిని గుర్తించి దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలని మంత్రి తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంపై కూడా గ్రామాల వారీగా వివరాలు సేకరిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఇప్పటికే ఎంతమందికి ఇళ్లు మంజూరయ్యాయి, ఎంతమంది నిర్మాణాలు చేపట్టారు, ఇంకా ఎంతమంది ఇళ్ల కోసం ఎదురుచూస్తున్నారు అనే వివరాలను సంబంధిత అధికారులు పరిశీలించి అర్హులైన వారికి ప్రభుత్వ పథకం అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. మహిళలకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత బస్సు ప్రయాణం వంటి సంక్షేమ పథకాల అమలు తీరును కూడా ప్రజల నుంచి తెలుసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకం చివరి అర్హుడి వరకు చేరేలా అధికారులు బాధ్యతతో పనిచేయాలని సూచించారు. గ్రామాల్లో ప్రజల సమస్యలను అధికారులు కేవలం నమోదు చేయడమే కాకుండా సంబంధిత శాఖల పరిధిలో పరిష్కరించాల్సిన సమస్యలకు కాలపరిమితితో చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ఒక శాఖకు సంబంధించిన సమస్యను మరో శాఖకు బదిలీ చేయకుండా పరస్పరం సమన్వయం చేసుకొని పరిష్కరించాలని సూచించారు. "సంక్షేమమే లక్ష్యం.. ప్రజలే మా కుటుంబం. నేను ఈ ప్రాంతానికి మంత్రిగా, శాసనసభ్యుడిగా ప్రజల సమస్యలను పరిష్కరించడం నా బాధ్యత. అందుకే పల్లె పల్లెకు పొన్నం అన్న కార్యక్రమం ద్వారా ప్రజల వద్దకే వచ్చి సమస్యలను తెలుసుకుంటున్నాను. నియోజకవర్గంలోని ప్రతి గ్రామం అభివృద్ధి చెందేలా, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి పనిచేస్తాను" అని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని సంబంధిత అధికారుల ద్వారా పరిష్కరించడంతో పాటు గ్రామాల అభివృద్ధికి అవసరమైన కొత్త పనులు, పథకాలను గుర్తించి ముందుకు తీసుకెళ్లడమే 'పల్లె పల్లెకు పొన్నం అన్న' కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని మంత్రి పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాజీ మండలాధ్యక్షుడు ఆయా గ్రామాల సర్పంచులు ఉపసర్పంచ్ వార్డు సభ్యులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అంగన్వాడి కార్యకర్తలు ఆశ వర్కర్లు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు అన్ని సెక్టార్లకు సంబంధించిన సిబ్బంది పాల్గొన్నారు.



జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem

# 22ఏ సమస్యపై ప్రతి ఫిర్యాదుకు పరిష్కారం..

**కాల్ సెంటర్‌కు వచ్చిన ఫిర్యాదు పరిష్కారమే లక్ష్యం**
**ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదు**
**అధికారులకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశం**

**హైదరాబాద్,ఆగస్ట్20(జై భీమ్ న్యూస్):**

22ఏ నిషేధిత భూముల అంశంలో ప్రజలకు పూర్తి భరోసా కల్పించే దిశగా రెవెన్యూ శాఖ చర్యలను మరింత వేగవంతం చేసిందని కాల్ సెంటర్‌కు వచ్చే ప్రతి దరఖాస్తును కేవలం ఒక ఫిర్యాదుగా కాకుండా ఒక బాధ్యతగా తీసుకోవాలని, సమస్య పరిష్కారమయ్యే వరకు ప్రత్యేకంగా పర్యవేక్షించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. విషయంలో ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి గారు స్పష్టం చేశారు. నిజమైన హక్కుదారులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని, అర్హత ఉన్న ప్రతి దరఖాస్తుదారుడికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. 22ఏ ఫిర్యాదులకు సంబంధించి ఏర్పాటు చేసిన కాల్ సెంటర్‌కు వస్తున్న కాల్స్, వాటి పరిష్కారం, ఏయే సమస్యలపై ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయి, వచ్చిన కాల్స్‌కు ఎలాంటి సమాచారం అందిస్తున్నారు తదితర అంశాలపై బుధవారం అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి గారు సమీక్షించారు. నాలుగు జిల్లాల్లో 22ఏ అంశంపై ప్రస్తుత పరిస్థితి, దరఖాస్తుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు సుమారు 400 కాల్స్ వచ్చినట్లు ఈ సందర్భంగా అధికారులు మంత్రి గారి దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ కాల్ సెంటర్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును నమోదు చేసి వదిలేయకుండా, దరఖాస్తుదారుడి పూర్తి వివరాలను ఎప్పటికప్పుడు సంబంధిత తహసీల్దార్, ఆర్డీవో, సబ్‌రిజిస్ట్రార్ తదితర అధికారులకు పంపించాలని ఆదేశించారు. ఆ సమస్య పరిష్కారమయ్యే వరకు దాని పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఞాల్ సెంటర్ నుంచి ఆన్‌లైన్‌లో ఫిర్యాదు స్వీకరించిన అధికారులు తక్షణమే స్పందించాలని ఆదేశించారు. వచ్చిన ఫిర్యాదుపై నిజానిజాలను నిర్ధారించి, దరఖాస్తుదారు పేర్కొన్న సమస్య వాస్తవమా? భూమి 22ఏ జాబితాలోకి ఎందుకు వచ్చింది? దరఖాస్తుదారుడికి అర్హత ఉందా? అనే అంశాలను క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించాలని సూచించారు. పరిశీలన అనంతరం స్పష్టమైన కారణాలతో నిర్ణయం తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు తమ సమస్యను చెప్పిన తర్వాత పరిష్కారం కోసం మళ్లీ మళ్లీ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా చూడాలని స్పష్టం చేశారు. ఇప్పటికే సబ్‌రిజిస్ట్రార్లు, తహసీల్దార్లు, ఆర్డీవోలు, కలెక్టర్ల స్థాయిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులతో పాటు, గడచిన రెండు మూడు రోజుల్లో కొత్తగా వచ్చిన దరఖాస్తులను కూడా వెంటనే పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. ఇకపై కొత్తగా వచ్చే దరఖాస్తులు పెండింగ్‌లో పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. 2ఏ సమస్య పరిష్కారాన్ని ప్రత్యేక టాస్క్‌గా తీసుకుని అధికారులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ పనిచేయాలని మంత్రి ఆదేశించారు. రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రెవెన్యూ కార్యాలయానికి వచ్చిన వ్యక్తి తన సమస్య పరిష్కారమవుతుందనే నమ్మకంతో బయటకు వెళ్లాలి. వచ్చిన దరఖాస్తును మరో కార్యాలయానికి పంపించి చేతులు దులుపుకోకండి. చివరి వరకు పర్యవేక్షించండి. మీ పనితీరుతో ప్రజల అభిమానాన్ని చూరగొనండి' అని అధికారులకు సూచించారు. అధికారులు సొంత నిర్ణయాలతో ప్రజలకు ఇబ్బంది కలిగించకూడదని, ప్రభుత్వ ఆలోచనలు, విధానాలకు అనుగుణంగా పనిచేయాలని స్పష్టం చేశారు.

# నేటి నుంచి జిల్లాల వారీగా రెవెన్యూ సమీక్షలు

**క్షేత్రస్థాయిలోనే సమస్యలకు పరిష్కారం చూపే లక్ష్యం**
**నేడు జగిత్యాలలో..రేపు నిజామాబాద్‌లో సమీక్ష**
**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కార్యాచరణ**

**హైదరాబాద్,ఆగస్ట్20(జై భీమ్ న్యూస్):**

ప్రజలకు రెవెన్యూ సేవలను మరింత చేరువ చేయడం, భూ సంబంధిత సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కారం చూపడమే లక్ష్యంగా రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లాల వారీగా సమీక్షలకు శ్రీకారం చుడుతున్నారు. శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే ఈ సమీక్షలు కేవలం అధికారిక సమావేశాలకే పరిమితం కాకుండా.. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటికి పరిష్కార మార్గాలను నిర్దేశిరచే విధంగా కొనసాగనున్నాయి. హైదరాబాద్ చుట్టుపక్కల జిల్లాల సమీక్షలను హైదరాబాద్ కేంద్రంగా నిర్వహించడంతో పాటు, దూర ప్రాంత జిల్లాలకు మంత్రి స్వయంగా వెళ్లి అక్కడే సమీక్షలు నిర్వహించనున్నారు. కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, తహశీల్దార్లు, ఇతర రెవెన్యూ అధికారులు, సబ్ రిజిస్ట్రార్లత్రో సహా సంబంధిత శాఖల అధికారులందరూ ఈ సమీక్షల్లో పాల్గొంటారు. ఆయా ప్రాంతాలకు సంబంధించిన ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలను కూడా సమీక్షల్లో భాగస్వాములను చేసి.. ప్రజల నుంచి వస్తున్న సమస్యలు, స్థానిక అవసరాలు, పరిష్కరించాల్సిన అంశాలను నేరుగా తెలుసుకునే విధంగా మంత్రిగారు ఈ సమీక్షలను నిర్వహించనున్నారు. రెవెన్యూ అంశాలతో పాటు ఇందిరమ్మ ఇళ్లు, హౌసింగ్ పథకాల అమలు, లబ్దిదారుల ఎంపిక, ఇళ్ల నిర్మాణ పురోగతి, స్థలాల సమస్యలు తదితర అంశాలను కూడా జిల్లా సమీక్షల్లో మంత్రి పరిశీలించనున్నారు. జిల్లాల వారీగా చేపట్టనున్న సమీక్షల్లో భాగంగా శుక్రవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా సమీక్షను జగిత్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించనున్నారు. శనివారం ఉమ్మడి నిజామాబాద్ జిల్లా సమీక్ష జిల్లా కేంద్రంలో నిర్వహించనున్నారు.

## మత్స్యకారుడి ఆయూకీ కోసం గాలింపు ముమ్మరం

**హోంమంత్రి వంగలపూడి అనిత వెల్లడి**

అమరావతి,ఆగస్ట్20(జై భీమ్ న్యూస్): సముద్రంలో గల్లంతైన మత్స్యకారుడు అప్పన్న ఆచూకీ కోసం గాలింపు చర్యలను ముమ్మరం చేయాలని హోంమంత్రి వంగలపూడి అనిత అధికారులను ఆదేశించారు. మత్స్యశాఖ, మెరైన్ పోలీసులు, కోస్ట్‌గార్డ్ సమన్వయంతో విస్తృతంగా గాలింపు చేపట్టాలని సూచించారు. ఈనెల 16న 8 మంది మత్స్యకారులు చేపల వేటకు వెళ్లగా.. సముద్ర తీరం నుంచి 12 నాటికల్ మైళ్ల దూరంలో బోటు ప్రమాదం జరిగిందని, ఈ ఘటనలో అప్పన్న గల్లంతయ్యారని అధికారులు మంత్రికి వివరించారు. మిగిలిన మత్స్యకారుల పరిస్థితిపైనా అనిత ఆరా తీశారు. గల్లంతైన అప్పన్నను క్షేమంగా గుర్తించి కుటుంబసభ్యుల వద్దకు చేర్చేందుకు అందుబాటులో ఉన్న అన్ని వనరులను వినియోగించాలని ఆదేశించారు. సముద్రంలో వేటకు వెళ్లే మత్స్యకారుల భద్రత విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని, గాలింపు చర్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని హోంమంత్రి తెలిపారు.

# సమస్యల పరిష్కారమే అసలైన సమాఖ్యవాదం



**మహాబలిపురం,ఆగస్ట్20(జై భీమ్ న్యూస్) :**

కేంద్ర,రాష్ట్రాల మధ్య ఉన్న సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించడంతో పాటు తీసుకున్న నిర్ణయాలను వేగంగా అమలు చేయడమే సహకార సమాఖ్యవాద స్ఫూర్తి అని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. భిన్నమైన ప్రయోజనాలు ఎదురైనప్పుడు కూడా న్యాయబద్ధమైన పరిష్కారాన్ని కనుగొనగలగడమే సమాఖ్య వ్యవస్థకు అసలైన పరీక్ష అని ఆయన పేర్కొన్నారు. మహాబలిపురంలో జరిగిన 31వ దక్షిణ ప్రాంతీయ మండలి సమావేశంలో ఆయన తెలంగాణ వైఖరిని స్పష్టంగా వెల్లడించారు. కేంద్ర హోం శాఖ మంత్రి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటుగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కర్నాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్, కేరళం ముఖ్యమంత్రి వీడీ సతీషన్, తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ ఇతర కీలక నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. మహాబలిపురంలోని చారిత్రక కట్టడాలను ప్రస్తావించారు. బలమైన నిర్మాణానికి ప్రతి భాగం ఒకేలా ఉండాల్సిన అవసరం లేదని, ప్రతి భాగం తన వంతు భారాన్ని మోయాల్సి ఉంటుందని అన్నారు. భారత సమాఖ్య వ్యవస్థ కూడా ఇదే స్ఫూర్తితో పనిచేయాలని పేర్కొన్నారు. భిన్నమైన ప్రయోజనాలను న్యాయబద్ధంగా, చట్టబద్ధంగా, సమర్థవంతంగా సమన్వయం చేయగల సంస్థలు ఉండటమే నిజమైన సమాఖ్యవాదమని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. పెట్టుబడులు, పరిశ్రమలు, ఉద్యోగాలు, ప్రతిభ కోసం రాష్ట్రాల మధ్య పోటీ సహజమేనని ఆయన చెప్పుకొచ్చారు. నదులు, విద్యుత్ గ్రిడ్లు, కార్మికులు, వ్యాపారాలకు రాష్ట్ర సరిహద్దులు అడ్డంకులు కావని డిప్యూటీ సీఎం చెప్పారు.సమస్యలు రాష్ట్ర సరిహద్దుల ను ప్రభుత్వ ÷ళ్లై కంటే వేగంగా దాటుతాయి భట్టి చమత్కరించారు. ఈ పరస్పర ఆధారిత పరిస్థితుల నేపథ్యంలో దక్షిణ ప్రాంతీయ మండలి వంటి సంస్థల ప్రాధాన్యత మరింత పెరుగుతోందన్నారు. నిబంధనలు స్పష్టంగా ఉండడంతో పాటుగా అన్ని రాష్ట్రాలకు ఒకే నిబంధనలు వర్తించాలని తెలంగాణ కోరుకుంటోందని తెలిపారు. కృష్ణా జలాల విషయంలో తెలంగాణ చాలా స్పష్టంగా ఉందని చెప్పారు. ఇప్పటికే ఏర్పాటైన చట్టపరమైన వ్యవస్థల ప్రకారం రాష్ట్రానికి దక్కాల్సిన న్యాయమైన వాటాను తెలంగాణ కచ్చితంగా కోరుకుంటోందని చెప్పారు. దిగువ రాష్ట్రాల హక్కులకు భంగం కలిగించే ఏకపక్ష చర్యలను అడ్డుకోవాలని, కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలోని అన్ని రాష్ట్రాలకు ఒకే సూత్రాలను వర్తింపజేయాలని ఆయన చెప్పారు. తెలంగాణ,ఆంధప్రదేశ్ మధ్య కృష్ణా జలాల కేటాయింపు అంశం ప్రస్తుతం కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్?ఎఎ పరిధిలో ఉందని ఆయన గుర్తు చేశారు. చట్టపరమైన పక్రియ ద్వారా త్వరగా సమస్యకు పరిష్కారం కనుగొనాలని ఆయన చెప్పారు. మిగులు జలాలపై దిగువ రాష్ట్రంగా తెలంగాణకు ఉన్న హక్కులను దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ మండలి సమావేశంలో భట్టి విక్రమార్క మరోసారి స్పష్టంగా చెప్పారు. పాలమూరు?రంగారెడ్డి, నక్కలగండి ఎత్తిపోతల పథకాల విషయంలో తెలంగాణ ప్రయోజనాలను పరిరక్షించాలని చెప్పారు. కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని కోరారు. కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ చర్యలు కొనసాగుతున్నాయని, తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత?చేవెళ్ల ప్రాజెక్టును పునరుద్ధరించే చర్యలు కూడా ముందుకు సాగుతున్నాయని చెప్పారు. పాలమూరు?రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో మిగిలిన పనులను పూర్తి చేసి ప్రాజెక్టును పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావడానికి కేంద్రం సహకరించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014 అమల్లోకి వచ్చి 12 ఏళ్లు గడిచినా రెండు తెలుగు రాష్ట్రాల మధ్య అనేక అంశాలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా ఈ సమస్యలకు తుది పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందని ఆయన చెప్పారు. పరిష్కారం అంటే అంతులేని ఉత్తర ప్రత్యుత్తరాలు కొనసాగించడం కాదని, ప్రతి కొన్ని సంవత్సరాలకు కొత్త అర్థాలు, వివరణలు ఇవ్వడం కూడా కాదని ఆయన వ్యాఖ్యానించారు. పెండింగ్ అంశాలు ఇకపై తుది నిర్ణయాలు, సమర్థవంతమైన అమలు దిశగా సాగాలని తెలంగాణ కోరుకుంటోందని అన్నారు. షెడ్యూల్ లోని ప్రభుత్వ సంస్థలు, కార్పొరేషన్ల విభజనకు సంబంధించి 23 సంస్థలపై తెలంగాణ తన అభిప్రాయాలను ఇప్పటికే కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు సమర్పించిందని తెలిపారు. ఆంధప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం?2014కు సంబంధించి సమస్యల పరిష్కారానికి తెలంగాణ సిద్ధంగా ఉందని తెలిపింది. సమస్యలు త్వరితగతిన పరిష్కారం కావాలని కోరుకుంటున్నప్పటికీ, అది తప్పనిసరిగా చట్టపరమైన వ్యవస్థ పరిధిలోనే ఉండాలని స్పష్టంగా చెప్పారు. షెడ్యూల్?చీ సంస్థలకు సంబంధించిన ఆస్తుల విభజనను ఆంధప్రదేశ్ కోరుతోందని, అయితే పునర్వ్యవస్థీకరణ చట్టంలో అందుకు స్పష్టమైన ఆధారం లేవని ఆయన చెప్పారు. సెక్షన్ 75 కింద సౌకర్యాల కొనసాగింపునకు సంబంధించిన అంశాలు మినహా ఎలాంటి ఆస్తుల విభజనకు చట్టపరమైన మద్దతు లేదని తెలిపారు. ఈ అంశం ఆంధప్రదేశ్ హైకోర్టు పరిధిలో కూడా పెండింగ్‌లో ఉన్నందున, చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా న్యాయపరమైన పక్రియ ద్వారానే పరిష్కారం కనుగొనాలని కోరారు. నీటి భద్రత, ఇంధన భద్రత, వాతావరణ మార్పులు, పట్టణీకరణ, రవాణా?లాజిస్టిక్స్, ఆర్థిక పోటీతత్వం వంటి అంశాలు రాబోయే రోజుల్లో దక్షిణాది రాష్ట్రాలకు కీలక సవాళ్లుగా మారనున్నాయని అన్నారు. ఈ సవాళ్లను ఎదుర్కొనేందుకు రాష్ట్రాలు పోటీ పడుతూనే పరస్పరం సహకరించుకోవాల్సి ఉంటుందని చెప్పారు. దక్షిణ భారతదేశం కలిసి అభివృద్ధి చెందితే, భారతదేశం మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. తదుపరి 32వ దక్షిణ ప్రాంతీయ మండలి సమావేశాన్ని హైదరాబాద్‌లో నిర్వహించేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. దక్షిణాది రాష్ట్రాల మధ్య సమస్యలకు చర్చల ద్వారా శాశ్వత పరిష్కారాలు కనుగొనాలని ఆకాంక్షించారు. ట్రిబ్యునల్ లేకుండా, కమిటీ లేకుండా, బహుశా మరోసారి ఉత్తర ప్రత్యుత్తరాలు కూడా లేకుండా సమస్యలు పరిష్కారం కావాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశానికి హాజరయ్యే అన్ని రాష్ట్రాలకు తెలంగాణ ఆత్మీయ ఆతిథ్యం అందిస్తుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు.

## సుష్మిత వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతం

**అందు9కు తనను బాధ్యులు చేయడం తగదు**
**క్రమశిక్షణ లేఖను ఉపసంహరించుకోవాలన్న కొండా సురేఖ**

**హైదరాబాద్,ఆగస్ట్20(జై భీమ్ న్యూస్) :**

తన కుమార్తె సుస్మితా పటేల్ చేసిన వ్యాఖ్యలు పూర్తిగా ఆమె వ్యక్తిగతమని తెలంగాణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. ఆ వ్యాఖ్యలతో తనకు ఎలాంటి సంబంధం లేదన్నారు. గురువారం టీపీసీసీ క్రమశిక్షణ కమిటీకి ఆమె లేఖ రాశారు. ఈ సందర్భంగా తన కుమార్తె చేసిన వ్యాఖ్యలపై ఆ లేఖలో మంత్రి కొండా సురేఖ వివరణ ఇచ్చారు. తన కుమార్తె అయినంత మాత్రాన.. ఆమె వ్యక్తిగత అభిప్రాయాలకు మరొకరు రాజకీయంగా బాధ్యత వహించాలనడం సముచితం కాదని స్పష్టం చేశారు. సుస్మితా పటేల్ చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిగా చేయడం సహజ న్యాయ స్ఫూర్తికి విరుద్ధమని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకత్వంపై, పార్టీ క్రమశిక్షణా నియమావళిపై తనకు సంపూర్ణ గౌరవం ఉందని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య విలువలు, వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ఈ అంశంలో తన ప్రమేయం లేదని గుర్తించాలని కమిటీకి ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో తనకు జారీ చేసిన నోటీసును ఉపసంహరించుకోవాలని ఈ సందర్భంగా క్రమశిక్షణా కమిటీని మంత్రి కొండా సురేఖ కోరారు. వరంగల్ జిల్లా గీసుకొండలో బుధవారం మంత్రి కొండా సురేఖ జన్మదిన వేడుకలను ఆమె అభిమానులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె కుమార్తె సుస్మితా పటేల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సుస్మిత మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో పరకాల నుంచి తాను బరిలో దిగుతానని ప్రకటించారు. పార్టీ అధిష్ఠానం తనకు టికెట్ ఇవ్వకున్నా.. ఇండిపెండెంట్‌గా బరిలో దిగుతానని వెల్లడించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డిపై ఆమె సంచలన వ్యాఖ్యలు చేశారు. సుస్మిత వ్యాఖ్యలు మీడియా, సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ నేపథ్యంలో సుస్మితా పటేల్ వ్యాఖ్యలపై పార్టీ అధిష్ఠానం సీరియస్ అయింది. పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్.. ఈ అంశంపై నివేదిక ఇవ్వాలని పీసీసీని కోరింది. అలాగే క్రమశిక్షణ కమిటీ చైర్మన్, ఎంపీ మల్లు రవి కూడా స్పందించారు. దీనిపై మంత్రి కొండా సురేఖను వివరణ కోరతామని అన్నారు. ఈ నేపథ్యంలో గురువారం క్రమశిక్షణ కమిటీకి మంత్రి కొండా సురేఖ లేఖ రాశారు.

## అద్దెకున్న యువకుడి దురాగతం

**ప్రశ్నించిన పాపానికి ఓనర్ దారుణహత్య**

**విశాఖపట్టణం,ఆగస్ట్20(జై భీమ్ న్యూస్) :**

విశాఖ నగరంలో ఓ విశ్రాంత ఉద్యోగి దారుణ హత్యకు గురయ్యారు. ఇంట్లో అద్దెకున్న వారిని ప్రశ్నించినందుకు వారే ఈ హత్యకు ఒడిగట్టారు. వివరాల్లోకి వెళితే.. ఎయిర్‌పోర్ట్ పోలీస్ స్టేషన్ సమీపంలోని ఓ అపార్ట్‌మెంట్ ఎ÷-లాట్‌లో అ÷-దదెకు ఉన్న ఐదుగురు యువకులు మూడు రోజుల క్రితం ఎ÷-లాట్‌ను ఖాళీ చేశారు. అయితే, వారు ఖాళీ చేసిన ప్లాట్‌లోని సామగ్రి ధ్వంసం చేశారనే కారణంతో యజమాని దుర్గాప్రసాద్ యువకులను పిలిపించారు. ఆయనతో మాట్లాడేందుకు వచ్చిన ఇద్దరు యువకులు వాగ్వాదానికి దిగడంతో ఘర్షణ జరిగింది. వారిలో ఓ యువకుడు దుర్గాప్రసాద్‌పై దాడి చేయడంతో ఆయన మృతి చెందినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## శ్రీనివాసరెడ్డి అక్రమాస్తులు వందకోట్లు

**అరెస్ట్ చేసిన ఎసిబి అధికారులు**

**హైదరాబాద్,ఆగస్ట్20(జై భీమ్ న్యూస్):**

అక్రమాస్తుల కేసులో ఇబ్రహీంపట్నం ఆర్డీవో కార్యాలయంలో డివిజనల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డిని రంగారెడ్డి ఏసీబీ అధికారులు గురువారం అరెస్ట్ చేశారు. అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మరికాసేపట్లో శ్రీనివాస్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరుస్తామని అన్నారు. ఈ సందర్భంగా అతడి ఆస్తులకు సంబంధించిన ప్రెస్ నోట్‌ను ఏసీబీ అధికారులు విడుదల చేశారు. శ్రీనివాస్‌రెడ్డి నివాసం, కార్యాలయంతో పాటు మరో ఐదు ప్రాంతాల్లో ఏసీబీ సోదాలు జరిపిందని వివరించారు. ఈ సోదాల్లో భారీగా ఆస్తులు, నగదు, బంగారం, బ్యాంక్ బ్యాలెన్స్ గుర్తించినట్లు తెలిపింది. కర్మన్‌ఘాట్‌లో రెండు రెసిడెన్షియల్ ఎ÷-లాట్లు.. వీటి విలువ రూ.2.63 కోట్లు ఉంటుందని పేర్కొంది. అలాగే కర్మన్‌ఘాట్‌లో ఉ?3 పెంట్‌హౌస్.. దీని విలువ రూ.1.61 కోట్లు ఉంటుందని చెప్పింది. యాచారం మండలం నల్లవెల్లి గ్రామంలో 10 ఎకరాల వ్యవసాయ భూమితోపాటు వివిధ ప్రాంతాల్లో 8 ఓపెన్ ఎ÷-లాట్లు ఉన్నట్లు గుర్తించామని వివరించింది. నరేంద్ర బార్ అండ్ రెస్టారెంట్‌లో రూ.86 లక్షల పెట్టుబడి పెట్టినట్లు ఈ సోదాల్లో గుర్తించామని పేర్కొంది. ఈ సోదాల్లో రూ.4 లక్షల నగదు, బ్యాంక్‌లో రూ.8.60 లక్షల బ్యాలెన్స్ ఉందని స్పష్టం చేసింది. క 680 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపింది. నాలుగు ఫోర్ వీలర్లు, మూడు టూ వీలర్లు.. మొత్తం 7 వాహనాలు ఉన్నాయని వెల్లడించింది. ఈ వాహనాల విలువ సుమారు రూ.59 లక్షలు ఉంటుందని పేర్కొంది. ఇంట్లో రూ.11 లక్షల విలువైన వస్తువులు, ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లు ఉన్నాయని.. వాటిని సీజ్ చేశామంది. బ్యాంకులో 46 తులాల బంగారం తాకట్టు పెట్టి రుణం తీసుకున్నట్లు గుర్తించారు. ÷-రీనివాస్‌రెడ్డి ఆస్తుల మొత్తం విలువ సుమారు రూ.6.87 కోట్లు ఉందని.. బహిరంగ మార్కెట్లో వీటి విలువ వందల కోట్ల రూపాయిలు ఉంటుందని అంచనాకు వచ్చినట్లు తెలిపింది. ఈ మేరకు విడుదల చేసిన ప్రెస్ నోట్‌లో ఏసీబీ వివరించింది. గతంలోనూ.. 2009లో శ్రీనివాస్‌రెడ్డిపై ఆదాయానికి మించిన ఆస్తులు కేసు నమోదు చేసినట్లు గుర్తు చేసింది. అప్పట్లో మహేశ్వరం మండలంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారని ఏసీబీ అధికారులు వివరించారు.

## బార్క్ ప్రాజెక్టుకు భారీ ఊరట

అమరావతి,ఆగస్ట్20(జై భీమ్ న్యూస్):అనకాపల్లి జిల్లాలో చేపట్టనున్న బార్క్ ప్రాజెక్టుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఊరట కల్పించింది. ప్రాజెక్టు కోసం భూముల రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన స్టాంప్ డ్యూటీ, ఫీజులను మినహాయిస్తూ నిర్ణయం తీసుకుంది. అనకాపల్లిలో 4,950 ఎకరాల భూమి రిజిస్ట్రేషన్‌కు ఫీజులను మినహాయిస్తూ సర్కార్ జీవో జారీ చేసింది. తొలి దశలో అచ్చుతాపురం, మునగపాక మండలాల్లోని 1,947.225 ఎకరాల భూములకు స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజుల మినహాయింపు వర్తించనుంది. అనంతరం మిగిలిన భూములకు కూడా దశలవారీగా ఈ రాయితీని రెవెన్యూ శాఖ వర్తింపజేయనుంది. అచ్చుతాపురం ప్రాంతంలో క్లీన్ ఎనర్జీ, అణు పరిశోధన, రేడియేషన్ సాంకేతికతపై పరిశోధనలు నిర్వహించే కేంద్రాన్ని బార్క్ ఏర్పాటు చేయనుంది. దేశ రక్షణ, ఇంధనం, వైద్యం, వ్యవసాయం తదితర రంగాల్లో పరిశోధనల కోసం బీఏఆర్సీ ప్రాజెక్ట్ కీలకంగా మారనుంది.

# తెలంగాణలో దోపిడీ పాలన సాగుతోంది

**నిషేధిత జాబితాకు పొంగులేటిదే బాధ్యత**
**పొంగులేటి వెంటనే రాజీనామా చేయాలి**
**బిజెపి ఎంపి లక్ష్మణ్ డిమాండ్**

**న్యూఢిల్లీ,ఆగస్ట్20(జై భీమ్ న్యూస్):**

రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రాజీనామా చేయాలని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ డిమాండ్ చేశారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. ఎవరు చెప్తే భూములను నిషేధిత జాబితాలో పెట్టారో మంత్రి పొంగులేటి చెప్పాలన్నారు. తెలంగాణలో ప్రజాపాలన లేదని.. దోపిడి పాలన ఉందని విమర్శించారు. భూదందాలు చేస్తూ ప్రజల భూములను లూటీ చేస్తున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి ఇల్లు నిషేధిత జాబితాలో చేరిందన్నారు. ప్రజలు కష్టపడి సంపాదించిన భూములు నిషేధిత జాబితాలో పెట్టారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రియల్ ఎస్టేట్ వ్యాపారంగా నడిపిస్తున్నారని వ్యాఖ్యానించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్షమాపణలు చెప్పడం సిగ్గు చేటని ఎంపీ అన్నారు. అధికారులను బాధ్యులుగా చేయడం కాదని.. దీనికి ఆదేశించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 22 ఏ జాబితాను బహిర్గతం చేయాలన్నారు. ప్రజల పక్షాన బీజేపీ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. 22 ం భూములపై సీబీఐ విచారణకు ఆదేశించాలని.. రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే జోక్యం చేసుకొని చర్యలు తీసుకోవాలన్నారు. భూములు నిషేధిత జాబితాలో పెట్టారని స్వయంగా మంత్రి కోమటిరెడ్డి బహిరంగ వ్యాఖ్యలు చేశారని అన్నారు. తెలంగాణలో భూముల పేరుమీద కుంభకోణాలు, సెటిల్మెంట్, దందాలు బయట పడుతున్నాయని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో భూములు కాజేయాలని చూస్తే రేవంత్ రెడ్డి పీసీసీగా ఉండి పోరాటం చేశారని.. భూములు కాపాడుతామని చెప్పారని గుర్తుచేశారు. ధికారంలోకి రాగానే ధరణిని బంగాళాఖాతంలో వేస్తామని రేవంత్ అన్నారని లక్ష్మణ్ తెలిపారు. గత బీఆర్ఎస్ హయాంలో 22 లక్షల ఎకరాలు నిషేధిత జాబితాలో అంటే... ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కోటి ఎకరాలను నిషేధిత జాబితాలోకి నెట్టిందని విమర్శించారు. వచ్చిన అవకాశాన్ని వినియోగించుకొని మంత్రులు దోపిడీ చేస్తున్నారని ఆరోపణలు గుప్పించారు. తెలంగాణ ప్రజల ఆస్తులు భద్రంగా ఉండాలంటే ఆర్మీని దింపాలని ఇటీవల హైకోర్టు వ్యాఖ్యలు చేసిందన్నారు. ఎవరి ఇళ్లు



ఎప్పుడు నిషేధిత జాబితాలోకి వెళ్తుందో అని ప్రజలు భయపడుతున్నారని ఎంపీ లక్ష్మణ్ పేర్కొన్నారు.

# లే ఔట్‌లోకి అక్రమంగా ప్రవేశించి దౌర్జన్యం

**ఫిర్యాదు కేసులో విచారణకు భూమన హాజరు**

**తిరుపతి,ఆగస్ట్20(జై భీమ్ న్యూస్):**

తిరుపతి మాజీ ఎమ్మెల్యే, వైకాపా నేత భూమన కరుణాకరరెడ్డి తిరుచానూరు పోలీస్‌స్టేషన్‌లో విచారణకు హాజరయ్యారు. తిరుపతికి చెందిన వెంకటేశ్వర ప్రసాద్ ఫిర్యాదు ఆధారంగా ఈనెల 12న పోలీసులు కేసు నమోదు చేశారు. కరుణాకరరెడ్డితో పాటు ఆయన కుమారుడు అభినయ్ రెడ్డి.. వ్యక్తిగత న్యాయవాదితో కలిసి విచారణకు వచ్చారు. చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్, తిరుచానూరు సీఐ సునీల్ కరుణాకరరెడ్డిని ప్రశ్నించారు. వైకాపా హయాంలో 2023 నవంబరు 4వ తేదీన కరుణాకరరెడ్డి, ఆయన అనుచరులు తిరుపతి రూరల్ మండలంలోని తనపల్లిలో తనకు చెందిన 7.91 ఎకరాల అప్రూవ్డ్ లేఅవుట్‌లోకి దౌర్జన్యంగా ప్రవేశించి దశాబ్దాల కిందట నాటిన మామిడి, టేకు, జామ, నేరేడు చెట్లను కొట్టేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ భూమిలో నుంచి భూమన కుటుంబానికి చెందిన మామిడి తోటకు రోడ్డు వేసేందుకు యత్నించారని, అక్కడున్న తన మనుషులను బెదిరించారని వెంకటేశ్వర ప్రసాద్ వివరించారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను తిరుచానూరు సీఐ సునీల్‌కు అందజేశారు. ఈనెల 12న బాధితుడు ఫిర్యాదు ఇవ్వగా అదేరోజు పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిపై భూమన, ఆయన కుటుంబసభ్యులు హైకోర్టును ఆశ్రయించగా విచారణకు సహకరించాలని స్పష్టం చేసింది. దర్యాప్తు కొనసాగించవచ్చని అధికారులకు సూచించింది. ఈ క్రమంలో భూ ఆక్రమణలకు సంబంధించి భూమనను పోలీసులు ప్రశ్నించారు.

# సిక్కు వ్యతిరేక అల్లర్ల నిందితుడు

**జైలులోనే సజ్జన్ కుమార్ మృతి**

**న్యూఢిల్లీ,ఆగస్ట్20(జై భీమ్ న్యూస్):**

మాజీ ప్రధాని ఇందిరా గాంధీ హత్యానంతరం జరిగిన సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసులో యావజ్జీవ కారాగార శిక్ష అనుభవిస్తున్న కాంగ్రెస్ మాజీ ఎంపీ సజ్జన్ కుమార్ (80) కన్నుమూశారు. ఢిల్లీలోని తీహార్ జైల్‌లో ఉన్న ఆయనను గురువారం సఫ్దర్‌జంగ్ ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే ఆయన మరణించినట్టు వైద్యులు తెలిపారు. సజ్జన్ మృతికి గల కారణాలు ఆసుపత్రి వర్గాలు ఇంకా వెల్లడించాల్సి ఉంది. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ 1984లో సిక్కు మతస్తులైన తన బాడీ గార్డుల చేతిలో హత్యకు గురైన విషయం తెలిసిందే. ఆ తరువాత ఢిల్లీ సహా ఉత్తరాదిన పలు ప్రాంతాల్లో సిక్కులపై భారీ స్థాయిలో మూక దాడులు జరిగాయి. ఇందుకు సంబంధించి కొన్ని కేసుల్లో సజ్జన్ కుమార్ దోషిగా తేలారు. ఈ దాడుల్లో సిక్కుల వ్యాపారాలు, నివాససముదాయాలపై దాడులు జరిగాయి. అనేక మంది కన్నుమూశారు. అధికారిక గణాంకాల ప్రకారం, నాటి దాడుల్లో 3 వేల పైచిలుకు మంది కన్నుమూశారు. పలామ్ కాలనీ ఏరియాలో జరిగిన ఐదుగురి హత్య ఉదంతంలో ఢిల్లీ హైకోర్టు సజ్జన్ కుమార్‌ను 2018లో దోషిగా తేల్చింది. యావజ్జీవ



కారాగార శిక్ష విధించింది. ఆ తరువాత ఢిల్లీ సారస్వత్ నగర్‌లో ఇద్దరు సిక్కుల హత్య కేసులో ఢిల్లీ హైకోర్టు 2025లో యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. అయితే, ఢిల్లీలోని జనక్‌పురి, వికాస్‌పురి ప్రాంతాల్లో జరిగిన హింసాత్మక ఘటనల కేసులో మాత్రం సజ్జన్ పాత్రను నిరూపించే ఆధారాలు లేకపోవడంతో కోర్టులో విముక్తి లభించింది. జాట్ వర్గం కీలక నేత సజ్జన్ కుమార్ 1980ల్లో ఢిల్లీ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించారు. 1977లో స్థానిక కౌన్సిలర్‌గా కెరీర్ ప్రారంభించిన ఆయన ఆ తరువాత ఔటర్ ఢిల్లీ నియోజకర్గం నుంచి మూడు సార్లు ఎంపీగా గెలిచారు.

# రైలు భూ భద్రత కోసమే భూ భారతి

**గతంలో బోగస్ పాస్ పుస్తకాలతో రైతుభరోసా స్వాహా**
**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి**

**ఖమ్మం,ఆగస్ట్20(జై భీమ్ న్యూస్):**

గత ప్రభుత్వ హయాంలో భూమి లేకపోయినా బోగస్ పాస్‌పుస్తకాలు సృష్టించి రైతుబంధు నిధులు స్వాహా చేసిన ఘటనలు ఉన్నాయని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. రాజకీయాలకు అతీతంగా రైతులకు భద్రత కల్పించడమే లక్ష్యంగా భూ భారతి ద్వారా సర్వే చేపడుతున్నామని స్పష్టం చేశారు. రైతుల భూములకు భద్రత కల్పించడంతో పాటు భూ రికార్డుల్లో పారదర్శకత తీసుకురావడమే భూ భారతి సర్వే ప్రధాన ఉద్దేశమని మంత్రి స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లాలోని సత్తుపల్లి మండలం నారాయణపురం గ్రామంలో భూ రీ-సర్వేపై నిర్వహించిన అవగాహన సదస్సులో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. రైతులతో ముఖాముఖి నిర్వహించి వారి భూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బేతుపల్లి రెవెన్యూ పరిధిలోని మొత్తం ఏడు గ్రామాల్లో భూ భారతి కార్యక్రమం కింద భూ సర్వే ప్రారంభమైనట్లు మంత్రి తెలిపారు. గతొలి విడతలో రాష్ట్రవ్యాప్తంగా 70 గ్రామాల్లో సర్వే నిర్వహిస్తున్నామని, ప్రతి ఆరు నెలలకు 70 గ్రామాల చొప్పున సర్వే కొనసాగించి ఏడాదిన్నర కాలంలో ప్రక్రియను పూర్తి చేస్తామని తెలిపారు. సర్వే ప్రక్రియలో రెవెన్యూ అధికారులు నిరంతరం కష్టపడుతున్నారని.. పూర్తయిన భూ వివరాలను కంప్యూటరీకరణ చేస్తున్నామని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. భూ భారతి చట్టాన్ని రైతులకు ఉపయోగపడేలా రూపొందించామని, భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ధరణి వ్యవస్థలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పుల కారణంగా రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని విమర్శించారు. ప్రస్తుతం బీఆర్ఎస్ నేతలు రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేస్తున్నారని, వాటికి స్పందించాల్సిన అవసరం లేదని అన్నారు. రంగులు వేరైనా బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు ఒక్కటేనంటూ రెండు పార్టీల మధ్య ఉన్న రాజకీయ బంధాన్ని కూడా ఆయన ప్రస్తావించారు.

# పాలిటెక్నిక్‌ల విలీనంపై అపోహలు తగవు

**నైపుణ్య శిక్షణ అందించాలన్నదే ప్రభుత్వ ఆలోచన**
**కార్మికశ్శాఖ మంత్రి వివేవక్ వెంకటస్వామి**

**హైదరాబాద్,ఆగస్ట్20(జై భీమ్ న్యూస్):**

ఇటీవల స్కిల్ యూనివర్సిటీలో పాలిటెక్నిక్‌ల విలీనంపై నెలకొన్న అపోహలకు మంత్రి వివేక్ వెంకటస్వామి తెరదించారు. స్కిల్ యూనివర్సిటీలో పాలిటెక్నిక్ కాలేజీల విలీనంపై కొందరు అపోహలు, తప్పుడు ప్రచారం చేస్తున్నారని కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. పాలిటెక్నిక్‌లను మరింత అప్‌గ్రేడ్ చేసి, విద్యార్థులకు మెరుగైన నైపుణ్య శిక్షణ అందించాలనే ఉద్దేశంతోనే వాటిని స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకొస్తున్నామని స్పష్టం చేశారు. బ్లూ కాలర్ ఉద్యోగాల్లోనూ తెలంగాణ యువత ముందుండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. పాలిటెక్నిక్ కాలేజీల లెక్చరర్లు, సిబ్బంది ప్రభుత్వ ఉద్యోగులుగానే కొనసాగుతారని, వారి సర్వీసు భద్రతకు ఎలాంటి ఇబ్బంది ఉండదని తెలిపారు. డిప్యూటేషన్, బదిలీల విధానంలోనూ ఎలాంటి మార్పులు ఉండవని చెప్పారు. స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేసినప్పటికీ పాలిటెక్నిక్ ఫీజుల్లో ఎలాంటి మార్పు ఉండదని, విద్యార్థులు ఈసెట్ ద్వారా బీటెక్ రెండో సంవత్సరంలో లేటరల్ ఎంట్రీ పొందే విధానం యథావిధిగా కొనసాగుతుందని మంత్రి స్పష్టం చేశారు. అలాగే పాలిసెట్‌ను కూడా కొనసాగిస్తామని తెలిపారు. పాలిటెక్నిక్ విద్యార్థులు, లెక్చరర్లకు విలీనంతో మరిన్ని ప్రయోజనాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. విద్యార్థులకు రూ.2 వేల స్టైఫండ్ అందించే అంశంపై కూడా కసరత్తు చేస్తున్నామని చెప్పారు. వరంగల్‌లో విద్యార్థి పట్ల అనుచితంగా ప్రవర్తించిన సీఐపై చర్యలు తీసుకుని బదిలీ చేశామని తెలిపారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పాలిటెక్నిక్ కాలేజీలను పట్టించుకోలేదని విమర్శించారు. విద్యార్థుల ఆందోళనల వెనుక రాజకీయ ప్రోద్బలం ఉందని ఆరోపించిన మంత్రి.. రాజకీయ పార్టీల తప్పుడు ప్రచారాన్ని విద్యార్థులు, ఉద్యోగులు నమ్మవద్దని సూచించారు. శక్తి శాఖ పేరును కార్మిక శాఖగా కొనసాగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తులు వస్తున్నాయని, శాఖ పేరులో 'కార్మిక' పదం కూడా ఉండేలా మార్పులు చేసే ఆలోచన ఉందని వెల్లడించారు.

# అమరావతిలో ఎంట్రీకి వివిధ రహదారులు

**పురోగతిని పరిశీలించిన మంత్రి నారాయణ**

**అమరావతి,ఆగస్ట్20(జై భీమ్ న్యూస్):**

రాజధాని అమరావతిలో ఎంట్రీకి మరిన్ని రహదారులను త్వరితగతిన అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. అందులో భాగంగా సీడ్ యాక్సెస్ రోడ్డు ప్రారంభంతో ఇతర రహదారుల కనెక్టివిటీపై మున్సిపల్ పరిపాలన శాఖ మంత్రి నారాయణ దృష్టి సారించారు. గురువారం వివిధ రహదారి నిర్మాణ పనుల పురోగతిపై ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. మంగళగిరి నుంచి అమరావతికిలోకి ప్రవేశించే ఇ 15 రోడ్డు పనులు వేగంగా జరుగుతున్నాయని మంత్రికి అధికారులు వివరించారు. 16వ నెంబర్ జాతీయ రహదారి నుంచి ఎయిమ్స్ ద్వారా అమరావతిలోకి ఇ 13 రోడ్డు ప్రవేశించనుంది. సీడ్ యాక్సెస్ రోడ్డు మూడో ఫేజ్‌లో నిర్మించే ఎలివేటెడ్ కారిడార్ (స్టీల్ బ్రిడ్జి – మణిపాల్ హాస్పిటల్) పనులు కూడా త్వరగా ప్రారంభించాలని అధికారులకు మంత్రి నారాయణ సూచించారు. సీడ్ యాక్సెస్ రోడ్డుకు సమాంతరంగా కరకట్టను వెడల్పు చేస్తూ ప్రకాశం బ్యారేజీ వరకూ ఇ 1 రోడ్డును నిర్మిస్తున్నారు. ఆయా రోడ్ల నిర్మాణాలకు అవసరమైన రైల్వే ఇతర అనుమతులు దాదాపు కొలిక్కి వచ్చాయని మంత్రి నారాయణ దృష్టికి అధికారులు తీసుకెళ్లారు. రోడ్ల పనులకు ఆటంకాలు లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని గుంటూరు జిల్లా కలెక్టర్‌ను ఈ సందర్భంగా మంత్రి ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశానికి సీఆర్డీఏ కమిషనర్ విజయరామరాజు, అడిషనల్ కమిషనర్ కార్తీక్, గుంటూరు జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మతోపాటు వివిధ శాఖల ఇంజినీర్లు హాజరయ్యారు.

# అసెంబ్లీలో చర్చకు రాకుండా పలాయనం

**మాజీ సెం జగన్‌పై లోకేశ్ విమర్శలు**

అమరావతి,ఆగస్ట్20(జై భీమ్ న్యూస్): ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించే పరీక్షల వ్యవస్థపై వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌కు అవగాహన లేదని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ విమర్శించారు. వైఎస్ జగన్ చేసిన వ్యాఖ్యలకు మంత్రి లోకేశ్ గురువారం కౌంటర్ ఇచ్చారు. ఏపీపీఎస్సీ, డీఎస్సీ రెండూ ఒకటే అనుకుంటున్నారా? అంటూ వైసీపీ అధినేతపై మండిపడ్డారు. ఈ రెంటి గురంచి జగన్‌కు తెలియదంటూ వ్యంగ్యంగా అన్నారు. ఈ రెండు పరీక్షలను ఒకే గాటిన కట్టడం, ఒకటే అనుకోవడం జగన్ అవగాహన స్థాయిని తెలియజేస్తుంటూ ఎద్దేవా చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించ లేదని విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు డీఎస్సీ నిర్వహించ లేకపోయారు.. ప్రస్తుతం అసెంబ్లీలో చర్చకు రాకుండా పారిపోతున్నారంటూ జగన్‌కు చురకలంటించారు పరీక్షల వ్యవస్థపై అవగాహన లేని వ్యక్తి ఇప్పుడు ప్రశ్నలు లేవనెత్తుతున్నారంటూ జగన్‌పై మంత్రి లోకేశ్ నిప్పులు చెరిగారు. బీఎస్సీ, ఏపీపీఎస్సీ మధ్య తేడా తెలియని వైఎస్ జగన్‌కు పరీక్షలపై మాట్లాడే అర్హత ఉందా? అంటూ ఆయన సూటిగా ప్రశ్నించారు. ఈ మేరకు మంత్రి లోకేశ్ తన ఎక్స్ ఖాతా వేదికగా జగన్‌కు కౌంటర్ ఇచ్చారు.

# రాష్ట్రంలో అధ్వాన్నింగా స్కూళ్లు

**మహారాష్ట్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి**
**అభిజీత్ దీప్కే డిమాండ్**

ముంబై,ఆగస్ట్20(జై భీమ్ న్యూస్): మహారాష్ట్ర విద్యాశాఖ మంత్రి దాదా భూసే తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని స్కూళ్లల్లో మౌలిక వసతుల సరిగా లేని వైనంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గత వారం ప్రారంభించిన స్కూల్ ఠీక్ కరో కార్యక్రమంలో భాగంగా తాజాగా ఆయన లాతూర్ జిల్లాలోని ఉజనీ గ్రామంలోని జిల్లా పరిషత్ స్కూల్‌ను సందర్శించారు. స్కూళ్లల్లో సరైన తరగతి గదులు, బెంచీలు, టాయిలెట్లు, స్కూళ్లకు వెళ్లేందుకు భద్రమైన రోడ్లు లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మౌలిక వసతులు లేకుండా పిల్లలు ఎలా చదువుకుంటా రని ప్రశ్నించారు. స్కూళ్ల పరిస్థితి సరిగా లేని తీరుపై ప్రజాప్రతినిధులే బాధ్యత వహించాలని అన్నారు. విద్యాశాఖకు వారు తగిన ప్రాధాన్యం ఇచ్చేలా ఒత్తిడి తీసుకురావాలని అన్నారు. కొన్ని స్కూళ్లల్లో పిల్లల పరిస్థితి జంతువుల కంటే దారుణంగా ఉందని అన్నారు. విద్యార్థులకు ఎలాంటి మంచీ చేయలేని రాజకీయ నాయకులకు ప్రజలు ఎందుకు ఓటు వేయాలని ప్రశ్నించారు. వాళ్లు ప్రజాప్రతినిధులు అయ్యాక హెలికాప్టర్లలో తిరుగుతారని ఓటు వేయాలా అని ప్రశ్నించారు. తమ పిల్లలు ఎలాంటి పరిస్థితుల్లో చదువుకుంటున్నారో ప్రజలు పరిశీలించుకోవాలని అన్నారు. ప్రజాప్రతినిధుల ఇళ్లల్లోని పెంపుడు జంతువులకు ఇంతకంటే మంచి వసతులు ఉన్నాయని అన్నారు. విద్యాశాఖపై దృష్టిపెట్టాలని తమ గ్రామానికి వచ్చే ప్రతి నేతనూ కోరాలని ప్రజలకు సూచించారు.

# లద్దాఖ్‌లో హైకోర్టు బెంచ్ ఏర్పాటు

**కేంద్రం నిర్ణయించిందన్న అమిత్ షా**

**న్యూఢిల్లీ,ఆగస్ట్20(జై భీమ్ న్యూస్):**

కేంద్రపాలిత ప్రాంతమైన లద్దాఖ్‌లో హైకోర్టు బెంచ్‌ను ఏర్పాటు చేసేందుకు కేంద్రం నిర్ణయించింది. జమ్ముకశ్మీర్ హైకోర్టు బెంచ్‌ను లద్దాఖ్‌లో ఏర్పాటు చేసేందుకు ప్రధాని మోదీ సారథ్యంలోని కేంద్ర కేబినెట్ నిర్ణయించిందని హోం మంత్రి అమిత్ షా గురువారం తెలిపారు. బెంచ్ ఏర్పాటుతో లద్దాఖ్ ప్రజలకు న్యాయం మరింత చేరువవుతుందని చెప్పారు. ప్రస్తుతం జమ్మూకశ్మీర్, లద్దాఖ్ కేంద్ర పాలిత ప్రాంతాలకు ఒకే హైకోర్టు ఉన్న విషయం తెలిసిందే. కేంద్రం 2019లో జమ్మూకశ్మీర్ రాష్ట్రాన్ని విభజించి రెండు కేంద్ర పాలిత ప్రాంతాలను ఏర్పాటు చేసింద. ఇదిలా ఉంటే, కేంద్రం బుధవారం రూ.9,450 కోట్ల విలువైన నాలుగు రైల్వే ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. ఖరగ్‌పూర్-భద్రక్ మధ్య, భద్రక్-హరిదాస్‌పూర్ మధ్య అదనపు రైల్వే లైన్ ఏర్పాటు చేయడంతో పాటు ఏపీ-తమిళనాడు, కటక్, పారాదీప్ మధ్య అదనపు లైన్‌ను ఏర్పాటు చేసేందుకు నిర్ణయించింది. 2030-31 కల్లా వీటి నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.

జై భీమ్ POWER OF PEOPLE

# జిల్లా కలెక్టర్ రాజ్యంగా బద్దంగా విధులు నిర్వహించాలి

## 90 ఏళ్ల ఘనమైన నట వారసత్వం మాది




భారతీయ చలనచిత్ర పరిశ్రమలో 90 ఏళ్ల ఘనమైన కుటుంబ వారసత్వాన్ని ముందుకు తీసుకువెళ్తున్న అక్కినేని త్రయం అక్కినేని నాగార్జున, నాగ చైతన్య, అఖిల్ తాజాగా సరికొత్త స్టైలిష్ లుక్స్‌తో అదరగొట్టారు. ప్రముఖ అంతర్జాతీయ వినోద మీడియా సంస్థ 'వెరైటీ ఇండియా' రెండో ఎడిషన్ కవర్ పేజీపై ఈ ముగ్గురు హీరోలు మెరిశారు. ఈ సందర్భంగా నాగార్జునతో పాటు అతడి కుమారులు వారి సినీ ప్రయాణం, కెరీర్‌కు సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. అక్కినేని కుటుంబం నుంచి తొమ్మిది దశాబ్దాల సినిమా చరిత్ర కొనసాగుతుండటం పట్ల టాలీవుడ్ కింగ్ నాగార్జున సంతోషం వ్యక్తం చేశారు. లెగసీ అంటే కేవలం నటులుగా ఉండటం కాదని, మొత్తం సినిమా రంగానికే సేవ చేయడమని ఆయన స్పష్టం చేశారు. అక్కినేని నాగేశ్వరరావు అడుగుజాడల్లో తాను ప్రయాణించానని, ఇప్పుడు తన కుమారులు నాగచైతన్య, అఖిల్ కూడా అదే బాటలో నడుస్తున్నారని తెలిపారు. సృజనాత్మక రంగంలో క్రమశిక్షణ ఎంత ముఖ్యమో చెబుతూ, షూటింగ్ సెట్స్‌లో ఎవరికోసం ఎప్పుడూ ఇబ్బంది కలిగించకూడదనే తన సిద్ధాంతాన్ని గుర్తుచేసుకున్నారు. 'శివ', 'గీతాంజలి' వంటి సాహసోపేతమైన చిత్రాలతో తాను ఎలా కొత్త మార్గాన్ని ఎంచుకున్నానో, అదే రీతిలో కుమారులు కూడా సొంత గుర్తింపు తెచ్చుకోవాలని నాగార్జున ఆకాంక్షించారు. నాగచైతన్య మాట్లాడుతూ.. దాదాపు 90 ఏళ్ల సినిమా ప్రయాణం కాలాతీతమైనదని, తాత నాగేశ్వరరావు, తండ్రి నాగార్జునల నుంచి తాను ఎంతో నేర్చుకున్నానని చైతూ తెలిపారు. సినిమా పరిశ్రమలోకి వచ్చిన మొదట్లో తనకంటూ ఒక స్టైల్ వెతుక్కునే క్రమంలో ఎంతో ఒత్తిడిని ఎదుర్కొన్నానని, అయితే కాలక్రమేణా సినిమాపై ఉన్న ఇష్టంతో ఆ సవాళ్లను అధిగమించానని చెప్పారు. అక్కినేని కుటుంబం అందించిన లెగసీని కాపాడుకోవడం తమ బాధ్యత అని యంగ్ హీరో అఖిల్ అక్కినేని పేర్కొన్నారు. తమ కుటుంబం నుంచి వచ్చిన వారసత్వాన్ని 'బంగారు బ్యాటన్'తో పోల్చిన ఆయన, దానిని మరింత ముందుకు తీసుకువెళ్లడమే తమ లక్ష్యమని తెలిపారు. తాత ఇచ్చిన వారసత్వాన్ని ఎప్పటికీ గుండెల్లో దాచుకుంటామని అఖిల్ భావోద్వేగంగా పంచుకున్నారు.

## తల్లిదండ్రుల మధ్య సేదదీరిన విజయ్ దేవరకొండ

**ఫోటోను షేర్ చేసిన రష్మిక మందన్నా**

టాలీవుడ్ రౌడీ హీరో విజయ్ దేవరకొండ తన కుటుంబంతో గడిపిన మధురమైన క్షణాలకు సంబంధించిన ఒక క్యూట్ ఫోటోను సోషల్ మీడియాలో పంచుకున్నారు. ప్రస్తుతం ఈ పిక్ నెట్టింట తెగ వైరల్ అవుతోంది. భారీ వర్షాల కారణంగా విజయ్ తాజా సినిమా షూటింగ్ అనూహ్యంగా రద్దు కాగా, ఆ సమయాన్ని ఆయన పూర్తిగా తన కుటుంబంతో కలిసి విశ్రాంతిగా గడపాలని నిర్ణయించుకున్నారు. చిన్నతనంలో తాను ఎంతో ఇష్టపడే ప్రదేశంలో, తన తల్లిదండ్రుల మధ్య హాయిగా నిద్రపోతున్న ఒక అరుదైన ఫోటోను ఆయన తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ వేదికగా అభిమానులతో పంచుకున్నారు. ఈ పిక్‌కు విజయ్ క్యాప్షన్ ఇస్తూ, వర్షం కారణంగా షూటింగ్ రద్దయిందని, చిన్ననాటి ఇష్టమైన ప్రదేశంలో మధ్యాహ్నం పూట ఇలా ప్రశాంతంగా నిద్రపోవడం వల్ల తన ఎనర్జీ రీఛార్జ్ అయిందని తెలిపారు. అంతేకాకుండా, ఈ అందమైన ఫొటోను తన సతీమణి, ప్రముఖ నటి రష్మిక మందన్న తీశారంటూ ఆమెకు ప్రత్యేకంగా క్రెడిట్ ఇవ్వడం విశేషం. ఈ దంపతుల అన్యోన్యతను చూసి అభిమానులు మురిసిపోతున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో వివాహ బంధంలోకి అడుగుపెట్టిన విజయ్, రష్మిక జోడీ ఆన్ స్క్రీన్‌పై కూడా మరోసారి సందడి చేయడానికి సిద్ధమవుతోంది. రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక పీరియాడికల్ డ్రామా 'రణబాలి' చిత్రంలో ఈ రియల్ లైఫ్ కపుల్ ఆన్ స్క్రీన్‌పై జంటగా నటిస్తున్నారు.



**పట్టాలు పంపిణీ చేసి మూడేళ్లు గడుస్తున్నాయి**

**సర్ ప్రక్రియలో భాగంగా నమోదు ప్రక్రియ పూర్తి చేయాలి**

**మాజీ మంత్రి బీ ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి**

**నేటి ప్రభాత దర్శిని జగిత్యాల ప్రతినిధి**

జగిత్యాల జిల్లా కేంద్రంలోని కేంద్రంలోని.బీ ఆర్ ఎస్ పార్టీ కార్యాలయం తెలంగాణ భవన్ లో మాజీ మంత్రి బీ ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి, జగిత్యాల జిల్లా పరిషత్ తొలి మాజీ ఛైర్పర్సన్ దావా వసంత సురేష్ తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు.2008 లో జగిత్యాల పట్టణంలో ఇల్లు లేని నిరుపేదలకు 4000 ఇల్లు మంజూరు చేయగా,తెలంగాణ రాష్ట్ర ఏర్పడిన తర్వాత కేవలం హైదరాబద్, సిద్దిపేట మినహా కేవలం జగిత్యాలలో 4000 డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేశారు. అప్పటి మున్సిపల్ మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు.2023 ఎన్నికలకు ముందు 3500 మందికి డబుల్ బెడ్రూం ఇళ్ల పట్టాలు మంజూరు చేశారు. జగిత్యాల మున్సిపల్ లో వార్డులు 48 నుండి 50 ఎన్నికలకు ముందు రెండు మున్సిపల్ వార్డులు పెంచారు. నూకపల్లి లోనే వార్డులు ఏర్పాటు చేయాలని తాను ఎమ్మెల్సీగా కలెక్టర్ మున్సిపల్ కార్యదర్శికి వినతి పత్రం సమర్పించాను అని జీవన్ రెడ్డి గుర్తు చేశారు.ఓటర్ ఎక్కడ నివాసం ఉంటే అక్కడ ఓటరు పేరు నమోదు చేయాలి.. రెండు ప్రాంతాల్లో ఓటు హక్కు ఉంటే ఓటరు అనుమతి తో ఒక చోట మాత్రమే ఓటు నమోదు చేసుకోవాలి.నూకపల్లి డబుల బెడ్రూం లో సుమారు 4000 మంది ఇళ్లలో సర్ ప్రక్రియలో ఒక్క ఓటు కూడా నమోదు కాలేదు. నివాసం ఉన్న ప్రాంతాన్ని పరిగణ లోకి తీసుకోకుండా ఎలక్షన్ కమిషన్ నిబంధనలకు విరుద్ధంగా గత ఎన్నికల జాబితాను పరిగణలోకి తీసుకొని, జిల్లా యంత్రాగం ఏం చేస్తుంది.మౌలిక సదుపాయాల కల్పన ఏర్పాటు తోపాటు డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కరించాలి.నాలుగు వేల మంది కి ఒక్క రేషన్ దుకాణం లేదు.డబుల్ బెడ్రూం ఇళ్లలో నాలుగు వేల కుటుంబాలు నివసితం ఉంటున్నాయా లేవా..చెప్పాలి.జిల్లా ఎన్నికల అధికారిగా జిల్లా కలెక్టర్ సర్ ప్రక్రియలో భాగంగా ఓటర్లు నివసితం ఉన్న చోట నమోదు చేయకపోవడం బీ ఎల్ ఓ ల నిర్లక్ష్యమా.. కలెక్టర్ నిర్లక్యమ.. ఎవరు బాధ్యత వహిస్తారో చెప్పాలి .లబ్ధిదారులకు కేటాయించిన ఇళ్లలో ఉండకపోవడనికి ఎవరు బాధ్యులు..అని



నిలదీశారు. నూకపల్లి అర్బన్ హౌసింగ్ లో 2009 లో మంజూరు అయిన ఇళ్లల్లో 1625 ఇల్లు వివిధ దశల్లో నిలిచి పోయాయి.డబుల్ బెడ్రూం ఇళ్ల లో మిగిలిన కేటాయింపు ఏవిదంగా చేయబోతున్నారు.. ఎల్ 2 లో ఎంతమంది లబ్ది దారులు ఉన్నారు.. వీరికి ఏవిధముగా ఇళ్ళు కేటాయించబోతున్నారు ప్రకటించాలి.ఎవరికైనా ఇళ్ళు కావాలంటే ఎమ్మెల్యే దగ్గరికి పోవాలంటున్నారు..ఇళ్ళు మంజూరు అధికారం ఎమ్మెల్యే కు ఇచ్చారా..ఇస్తే ఇచ్చామని చెప్పాలి..లబ్ధిదారుల ఎంపిక కు ఎమ్మెల్యేకు అధికారం ఇస్తే ప్రకటించాలి..జగిత్యాలను ఎమ్మెల్యే కు లీజు అగ్రిమెంట్ ఇచ్చారా..అని ప్రశ్నించారు.జగిత్యాల జిల్లా లో యంత్రాంగం పని చేస్తున్నదా.ఎల్ 2 లో అత్యంత పేదరికంలో ఉన్న వారిని గుర్తించి ఇళ్లు మంజూరు చేయాలి.

**జిల్లా కలెక్టర్ రాజ్యంగా బద్దంగా విధులు నిర్వహించాలి**

నూకపల్లి లో నివసితం ఉన్న వారి ఒక్క పేరు కూడా నమోదు కాలేదు.. నూకపల్లి లో ఒక్కరు కూడా ఉండడం లేదా..చెప్పాలి.1200 ఓటర్లు మించితే అదనంగా బూత్ కూడా ఏర్పాటు చేయాలని ఎలక్షన్ కమిషన్ చెబుతుంది. ఎమ్మెల్సీ ఎల్ రమణ శాసన మండలిలో ప్రశ్న లేవనేతితే మంత్రి పర్యటిస్తామని హామీ ఇచ్చారనీ గుర్తు చేశారు. సర్ ప్రక్రియలో పదివేల మంది పౌరుల ఓటర్లు నివసితం ఉన్న చోట ఓటు నమోదు చేయకపోవడం పై ఎవరు బాధ్యత వహిస్తారు అని నీలదీశారు.నూకపల్లి లో నమోదు చేయకపోవడంతో రేషన్ కోసం గతంలో ఉన్న ప్రాంతానికి వెళ్లాల్సి వస్తుంది..ఓటర్ నమోదు ప్రక్రియ చేయండి..రవాణా వసతి, రేషన్ దుకాణం, పాఠశాల ఏర్పాటు చేయాలి.జగిత్యాల లో కెసిఆర్ 4000 డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేశారు.భూ భారతి లో భూ బదలాయింపు కబ్జా కాలం చేర్చబడలేదు..అధికారులు పట్టాదారుపాస్ పుస్తకం ప్రకారం రిజిస్టర్ చేయాల్సి ఉండగా ఎమ్మార్వోకు చట్టంలో లేని అధికారాలు ఎక్కడి నుండి వస్తాయి.

కబ్జాలో ఉన్నారా లేదా.. అని పరిశీలించడం అవినీతికి ఆస్కారం కల్పిస్తున్నది. బీర్పూర్, రాయికల్ లో అధికారులు ఏసిబి కి పట్టుబడుతున్నారు.22ఏ హైదరాబద్ కు మాత్రమే పరిమితం లేదు.. జగిత్యాల లో కూడా ఉన్నాయి రెవెన్యూ మంత్రి జగిత్యాల పర్యటన నేపథ్యంలో 22 ఏ, భూ భారతి లో ఎన్ని దరఖాస్తులు ఎన్ని పెండింగ్ ఉన్నాయి. అన్నింటికి ఫుల్ స్టాప్ పెట్టాలి..

**సర్ ప్రక్రియలో భాగంగా నమోదు ప్రక్రియ పూర్తి చేయాలి.**

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం ఒక్కో ఇంటికి 5 లక్షలకు గాను 3,40,000 ఇచి చేతులు దులుపుకున్నారు. ఫైనల్ బిల్ వస్తాదా రాదా అని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.ఆరు నెలలుగా బిల్లులు చెల్లించకుండా ఎందుకు జాప్యం చేస్తున్నారు..తక్షణమేబిల్లుల చెల్లింపు చేయాలి..కొండ సుష్మిత, చిన్న రెడ్డి కి కాంగ్రెస్ పార్టీ షో కాస్ నోటీసు లు జారీచేయడం పై విలేకరులు అడిగిన ప్రశ్నకు జీవన్ రెడ్డి స్పందించారు.వలసదారుల తో సమస్య ఉత్పన్నం అవుతుంది..కొండా సుష్మితనూ రెచ్చగొట్టిన రేవంత్ రెడ్డి కి కేసు నోటీస్ కి ఇవ్వాలి..2034 వరకు రేవంత్ రెడ్డి నేను ముఖ్యమంత్రి అంటే మల్లికార్జున ఖర్గే పవర్ ఆఫ్ అటార్నీ రేవంత్ రెడ్డికి రాసి ఇచ్చారా... అని ప్రశ్నించారు.రాష్ట్రంలో కాంగ్రెస్ విచ్చినానీకి ప్రధాన కారణమే రేవంత్ రెడ్డి.. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించి, కాంగ్రెస్ విచ్చిన్నం చేస్తున్నదే రేవంత్ రెడ్డి.. క్రమశిక్షణ కమిటీ రేవంత్ రెడ్డి చెప్పు చేతుల్లో ఉన్నట్టు కనపడుతుంది..కాంగ్రెస్ ను కనుమరుగు చేయడం కోసమే రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ లో చేరాడు .తెలంగాణ రాష్ట్రాన్ని రేవంత్ రెడ్డి కి రాసిచినం అంటే కాంగ్రెను మరిచిపోవాలి..షో కాస్ నోటీస్ ఇవ్వాల్సి వస్తె ముందుగా రేవంత్ రెడ్డి కి ఇవ్వాలి..రాష్ట్రంలో పార్టీ ఫిరాయింపులను తెర లేపిందే రేవంత్ రెడ్డి అని. విమర్శించారు.రెండేళ్ల తర్వాత కాంగ్రెస్ పార్టీ ఉండదు.. రేవంత్ రెడ్డి ఉండనియడు.. జోస్యం చెప్పారు.సమావేశంలో వేంకటేశ్వర రావు, మున్నా, శీలం ప్రవీణ్ కుమార్, రమేష్ రావు, గాజుల రాజేందర్, దేవేందర్ నాయక్, కోరుకంటి రాము, తోట హరీష్, పుప్పాల అశోక్, దేవేందర్ నాయక్, సామల రాజశేఖర్, రాగుల ప్రదీప్, రజనీకాంత్, కళ్లేపల్లి దుర్గయ్య, వోళ్ళం మల్లేశం, పొట్టవతిని సతీష్, శీలం సురేందర్, చందా రాధ కిషన్, రఘువీర్ గౌడ్ , నేహాల్, ధర రమేష్ బాబు, శ్రీరాముల గంగాధర్, మల్లారెడ్డి, చెట్పల్లి సుధాకర్, మామిడిపల్లి మహిపాల్, నక్క జీవన్,ఆనంద్ రావు, కట్కూరి రాజేందర్,అభి,హరి,గంగారెడ్డి, తదితర నాయకులు పాల్గొన్నారు.

## మ్యూజికల్ డ్రామా.. జగమే సంగీతం

**అమెజాన్‌లో 4నుంచి వెబ్ సీరిస్**

టాలీవుడ్‌లో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిన మ్యూజికల్ డ్రామా సిరీస్ 'జగమే సంగీతం' ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమైంది. ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియో ఈ సిరీస్ ప్రపంచవ్యాప్త ప్రీమియర్ తేదీని అధికారికంగా ప్రకటించింది. కర్ణాటక సంగీత నేపథ్యంతో రూపొందిన ఈ ఒరిజినల్ సిరీస్ సెప్టెంబర్ 4 నుంచి ప్రసారం కానుంది. ప్రముఖ హిందీ సిరీస్ 'బందిష్ బాండిట్స్' స్ఫూర్తితో తెరకెక్కిన ఈ ప్రాజెక్ట్‌ను పల్నాటి సూర్య ప్రతాప్ సృష్టించి దర్శకత్వం వహించగా, సుష్మిత కొణిదెల నిర్మించారు. ప్రకాష్ రాజ్, శ్రీకాంత్, మధుబాల ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రంలో అక్షయ్ లగుసాని, సుస్మితా శెట్టి తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. వంగాల సూర్య మనోజ్, శ్రావణి సముద్రాల, ఎ.ఆర్. ప్రభావ్ ఈ సిరీస్‌కు కథను అందించగా, విశాల్ చంద్రశేఖర్ అందించిన సంగీతం ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. కర్ణాటక సంగీత సంప్రదాయాలను సమకాలీన శ్రుతులతో మేళవిస్తూ ఆయన అందించిన స్వరాలు ఈ కథకు ప్రాణం పోశాయని చెప్పవచ్చు. భారత్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా 240కి పైగా దేశాల్లో తెలుగుతో పాటు తమిళ డబ్బింగ్ వెర్షన్, ఇంగ్లీష్ సబ్‌టైటిల్స్‌తో ప్రైమ్ వీడియోలో ఈ సిరీస్ అందుబాటులోకి రానుంది. ఈ కథ విషయానికొస్తే.. కర్ణాటక సంగీత వారసత్వాన్ని కలిగిన కుటుంబం మరియు దాని మూలాల చుట్టూ ఈ సిరీస్ తిరుగుతుంది. తన తాత గారి సంగీత వారసత్వాన్ని కొనసాగించాలనుకునే బాలు అనే యువకుడు.. కుటుంబ బంధాలు, రహస్యాలు, సాంప్రదాయ కట్టుబాట్ల మధ్య ఎలా నలిగిపోయాడనేదే ప్రధానాంశం. తన కుటుంబం నిర్మించిన ప్రతిష్టను కాపాడుకుంటూనే, తనకంటూ ప్రత్యేకమైన కళాత్మక స్వరాన్ని ఎలా కనుగొన్నాడనే భావోద్వేగ ప్రయాణాన్ని ఇందులో చూపించనున్నారు. సంగీతంలోని భావోద్వేగ శక్తిని చాటిచెప్పే హృద్యమైన కథే 'జగమే సంగీతం' అని, సంప్రదాయం, ఆశయం వంటి అంశాలను ఇది అద్భుతంగా అన్వేషిస్తుందని తెలిపారు. అలాగే నిర్మాత సుష్మిత కొణిదెల మాట్లాడుతూ.. సంగీతం కేవలం ఒక కళ మాత్రమే కాకుండా, ఆ కుటుంబంలోని ప్రేమ, సంఘర్షణలను తెలిపే భావోద్వేగ భాషగా ఎలా మారుతుందో ఈ సిరీస్ ద్వారా చూపిస్తున్నామని పేర్కొన్నారు. అసాధారణ నటీనటులతో తెరకెక్కిన ఈ సంగీత భరిత ప్రయాణాన్ని ప్రేక్షకులు తప్పకుండా ఆస్వాదిస్తారని యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది.

## మమితా బైజు.. మరో మూవీతో సిద్ధం

'ఇప్పుడెందుకు చంద్రముఖిలో జ్యోతికలా బిహేవ్ చేస్తున్నావు' అంటూ 'విశ్వనాథ్ అండ్ సన్స్' చిత్రంతో ఇటీవలే తెరపై సందడి చేసి కుర్రకారుని ఆకట్టుకుంది అందాల తార మమితా బైజు. ఇప్పుడీ జోష్‌లోనే మరో ప్రేమకథతో ప్రేక్షకుల్ని అలరించడానికి రెడీగా ఉంది. ఆమె, నివిన్ పౌలీ జంటగా నటించిన చిత్రం 'బెత్లెహెం కుడుంబ యూనిట్'. 'ప్రేమలు' ఫేమ్ గిరీశ్ ఏడీ తెరకెక్కించారు. ఇప్పటికే విడుదలైన ట్రైలర్‌కు సినీప్రియుల నుంచి మంచి స్పందన వచ్చింది. ఇందులో భాగంగానే తాజాగా మరో పోస్టర్‌ను ఇన్‌స్టా వేదికగా పంచుకుంది మమిత. అందులో ఆమె కూర్చొని చిరునవ్వులు చిందిస్తూ ఆకట్టుకుంటుంది. ఫహాద్ ఫాజిల్, దిలీష్ పోతాన్ నిర్మించిన ఈ రొమాంటిక్ ప్రేమకథా చిత్రం ఈ నెల 21న థియేటర్లలోకి రావడానికి సిద్ధంగా ఉంది.

